మాతృభాష ప్రతి ఒక్కరి ఇంటి భాష కావాలన్నారు. వ్యక్తిని మోక్షం దిశగా నడిపించే ఒక ఆధ్యాత్మిక మార్గం మతం. ఆ లక్ష్యం దిశగా మనిషిని ముందుకు తీసుకు వెళ్లే జీవన విధానానికి సాధనంగా నిలిచే ఆచరణాత్మక మార్గదర్శి సంస్కృతి. భాష ఈ సంస్కృతిలోని అంతర్భాగం. అందుకే భాషను, సంస్కృతిని విడదీసి చూడలేము అని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రతి నాగరికత గొప్పదనం వారి భాష ద్వారానే వ్యక్తమవుతుందన్న ఉపరాష్ట్రపతి మన ఆటలు, మాటలు, పాటలు, సంగీతం, సాహిత్యం, కళలు, పండుగలు, పబ్బాలు, సామూహిక కార్యక్రమాలు, వ్యాపార లావాదేవీలన్నీ భాష లేకుండా పెంపొందలేవన్నారు. భాష సమాజాన్ని సృష్టించి జాతిని బలపరుస్తుంది, అభివృద్ధికి మార్గం వేస్తుంది అని తెలిపారు.


తెలుగు భాషాభివృద్ధి ప్రజా ఉద్యమంగా రూపుదాల్చాల్సిన అవసరం ఉందని... దీనికోసం ముందుగా తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచించాలన్నారు. ఇతర భాషలు నేర్చుకోవడం, ప్రావీణ్యత సాధించడం తప్పుకాదు. ఎవరైనా, ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చు. ఆ విషయంలో ఆకాశమే హద్దు. కానీ మాతృభాషను, మాతృమూర్తిని మరచిపోకూడదు. అందుకే భాషాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. అది తల్లిదండ్రుల బాధ్యత, గురువుల బాధ్యత, అన్నింటికీమించి ఎవరికివారే అమ్మ

లాంటి మాతృభాష కోసం ముందుకు కదిలి కాపాడు కోవలసిన బాధ్యత అని ఉపరాష్ట్రపతి అన్నారు.

8 అంశాల్లో 23 రకాల పోటీలు (సౌందర్యలహరి, తెలుగు వెలుగు, రాగమంజరి, నాదామృతం, అందెల రవళి, కళాకృతి, రంగస్థలం) నిర్వహించటం, మన సంస్కృతిని ప్రతిబింబించేలా వాటికి పేర్లు పెట్టడం చాలా చక్కని ఆలోచనన్నారు. పోటీలు జరుగుతున్న ఎనిమిది ప్రధాన అంశాలు కూడా తెలుగు జీవన విధానానికి, ఆలోచనాసరళికి, సంస్కృతికి అద్దంపట్టేలా ఉన్నాయంటూ పద్యం, సామెత, పరభాషలేని పలుకు, కళాకృతిలో ముగ్గులు, అల్లికలు, కట్టూబొట్టు అన్నీ విభాగాల పేర్లను ప్రస్తావిస్తూ అన్నివిభాగాల పేరును ప్రస్తావిస్తూ ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన తానా అధ్యక్షులు జయశేఖర్ తాళ్లూరిని, సమన్వయకర్త తూనుగుంట్ల శిరీషను అభినందించారు. శిరీష తెలుగు ఉచ్ఛారణ బాగుందని ప్రత్యేకంగా ప్రశంసించారు.

తానా అధ్యక్షులు జయ్ తాళ్లూరి మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతుల వికాసం కోసం, తెలుగు వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసం ఈ సాంస్కృతిక మహోత్సవం నిర్వహిస్తున్నామని, 390 వెబినార్లలో, 450 జడ్జిలతో, 550 వాలంటీర్లతో జరిగే ఈ కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 18 వేల మూడు వందల మంది పోటీలలో పాల్గొంటున్నారని తెలిపారు.

సౌందర్యలహరి, తెలుగు వెలుగు, రాగమంజరి, నాదామృతం, అందెల రవళి, కళాకృతి, రంగస్థలం, భువన విజయం వంటి 8 విభాగాల్లో పోటీపడుతూ ప్రతిభాపాటవాలను ప్రదర్శించబోతున్నారు. 1993లో అమెరికాలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించాము. ఇప్పుడు ఈ కరోనా కష్టకాలంలో ఇన్ని దేశాల్లో ఉన్న వాళ్లందరనూ కలుసుకొనే అదృష్టం అంతర్జాలం ద్వారా మాకు కలిగింది. ఈ ఉత్సవం ద్వారా వచ్చిన డబ్బుకు రెట్టింపు డబ్బు చేర్చి చేనేత కార్మికులకు ఆశు మిషన్లు అందిస్తామని చెప్పారు. తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ కోసం తానా కట్టుబడి ఉందని, అమెరికాలోని ప్రవాసాంధ్రుల పిల్లలకోసం పాఠశాలను నిర్వహిస్తున్నాము. ఈ పాఠశాల బోధనను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేయబోతున్నామని, అలాగే అమెరికాలో ప్రవాసాంధ్రులకు ఏ ప్రమాదం కలిగినా,



మరణాలు సంభవించినా ఆదుకోవడానికి సేవలం దించడానికి 600 మంది వలంటీర్లతో తానా టీమ్ స్క్వేర్ పేరుతో 24 గంటలు సేవలందిస్తుందోని తెలిపారు. ఈ సేవలను కూడా ప్రపంచవ్యాప్తంగా విస్తరించబోతున్నట్లు వివరించారు.

ప్రపంచంలోని తెలుగు కవులను, కళాకారులను ప్రోత్సహించేందుకే తానా ప్రపంచ సాహిత్య వేదికను ఏర్పాటు చేశామన్నారు. మన బలం తెలుగు, మన కులం తెలుగు అన్నారు. ఈ కార్యక్రమం కోసం అహో రాత్రులు కృషిచేసిన శిరీష తూనుగుంట్ల, భార్గవ్ శ్రీనివాస్‌రెడ్డిగార్లను అభినందించారు. టీవీ9, సాంకేతిక సహకారం అందించిన. బైట్ గ్రాఫ్ వారికి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పోటీలో ఎవరు గెలిచినా ఓడినా అది నిమిత్తమాత్రమే. చివరికి గెలిచేది తెలుగు భాష, నిలిచేది తెలుగు సంస్కృతి అని ఆయన అన్నారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్ మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణలో తానా వారు నిర్వహిస్తున్న సేవలను అభి నందించారు. పార్లమెంటు సభ్యులు గల్లా జయదేవ్ మాట్లాడుతూ ఇన్ని దేశాలలోని తెలుగువారిని ఒకే వేదిక మీదకు తీసుకురావడం అద్భుతమైన విషయ మని నిర్వాహకులను అభినందించారు. మరో పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వందలాది సంస్థలతో నిర్వహిస్తున్న ఈ తెలుగు వేడుకలు తెలుగు రాష్ట్రాలలో స్ఫూర్తిని నింప గలవని అన్నారు.

తెలంగాణ సాంస్కృతిక సారథి రసమయి బాల కిషన్, ఆంధ్రప్రదేశ్ అధికార సంఘం అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఓలేటి పార్వతీశం, ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రావుగారితోపాటు ఏ.పి.ఎన్.ఆర్.టి.ఎస్. అధ్యక్షులు వెంకట్ ఎస్. మేడపాటి తదితరులు



మాట్లాడుతూ తెలుగుభాష వైభవాన్ని చాటే ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల నిర్వాహకులను, తానా నాయకులను అభినందించారు. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో పాల్గొనటంపట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమ రూపకర్త విజయ భాస్కర్, ప్రధానపాత్ర పోషించిన జయహో భారతీయం శ్రీనివాస్ రెడ్డి, జిజ్ఞాస భార్గవ్ మరియు కార్యక్రమంలో పాల్గొన్న వివిధ దేశాల తెలుగు సంఘాల వారికి తూను గుంట్ల శిరీష ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఘనంగా ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవ ముగింపు వేడుకలు


ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 50 దేశాలలోని 100కుపైగా తెలుగు సంఘాలు, సాంస్కృతిక సంస్థలతో కలిసి జూలై 24 నుండి వారం రోజుల పాటు దృశ్య సమావేశాల ద్వారా నిర్వహించిన సాంస్కృతిక పోటీల ముగింపు వేడుకలు ఆగస్టు 2వ తేదీన అంతర్జాలంలో ఘనంగా జరిగాయి. తెలుగు భాషా సంస్కృతి వైభవం ఉట్టిపడే విధంగా సౌందర్య లహరి, తెలుగు వెలుగు, రాగమంజరి, నాదామృతం, అందెల రవళి, కళాకృతి, రంగస్థలం, భువనవిజయం వంటి ఎనిమిది విభాగాలలో 32 అంశాలలో ప్రపంచ వ్యాప్తంగా 18,300 మంది తెలుగువారు ఈ కార్య క్రమంలో పాల్గొని సంగీతం, సాహిత్యం, చిత్రకళ, సౌందర్య ప్రదర్శన, అభినయం, నాట్యం, గానంతో తమ ప్రతిభాపాటవాలను చాటారు. 475 మంది న్యాయనిర్ణేతలతో, 450 మంది వాలంటీర్లతో 382

జూమ్ సెషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు భారీ స్థాయిలో నిర్వహించడం అందరినీ మెప్పించింది.

తానా అధ్యక్షులు జయ్ తాళ్లూరి మాట్లాడుతూ, ఈ సాంస్కృతిక మహోత్సవం నిర్వహణకోసం తాము చేసిన కృషి ఫలించిందన్నారు. ప్రపంచంలోని తెలుగు వారందరినీ ఒకే వేదికపై తీసుకువచ్చేందుకు ఈ వేడుక దోహదపడిందని భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలను అందరితో కలిసే చేసేందుకు ఈ ఉత్సవాలు నాంది పలికాయన్నారు. ఈ మహోత్సవం విజయవంతానికి అహోరాత్రులు నెలలు తరబడి శ్రమించిన వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తు ముఖ్యంగా శిరీష తూనుగంట్ల, విజయ భాస్కర్, అలాగే ఇతర దేశాల సంస్థల ప్రతినిధులు... ఒకరా ఇద్దరా... ఎందరో మరెందరో ఈ మహా యజ్ఞంలో పాలుపంచుకున్నారు వారందరికీ, టీవీ 9 వారికి, బైట్‌గ్రాఫ్‌వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని జయ్ తాళ్లూరి తన ప్రసంగంలో చెప్పారు.

సాంస్కృతిక మహోత్సవం కన్వీనర్ శిరీష తూనుగుంట్ల సమన్వయకర్తగా వ్యవహరించగా, తానా కార్యదర్శి రవి పొట్లూరి స్వాగత వచనాలు పలుకగా, బోర్డ్ ఛైర్మన్ హరీష్ కోయ, ఫౌండేషన్ ఛైర్మన్ నిరంజన్ శృంగవరపు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ అంజయ్య చౌదరి లావు, కల్చరల్ కో ఆర్డినేటర్ సునీల్ పాంత్రా, ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్ లక్ష్మి దేవినేని అతిథులను పరిచయం చేశారు.

ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన జిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని, ప్రపంచ దేశాలు ఈ సంస్కృతిని ప్రశంసించాయని, మానసిక శారీరక ఆరోగ్యాలను కాపాడుకునే రక్షణ వ్యవస్థ మన సంస్కృతిలో దాగి ఉందని, ఎటువంటి సందర్భాల్లోనైనా ఎటువంటి సమస్యలనైనా సులభంగా ఎదుర్కొనేతత్వం భారతీయ సాంప్రదాయంలో, మన జీన్స్‌లో ఉందని, అందుకే మనవారు ఎక్కడైనా రాణించగలుగుతున్నారని అటువంటి సంస్కృతిని మనం పరిరక్షించుకోవాలని అన్నారు. మరో అతిథి డిఆర్‌డిఓ చైర్మన్ జీ. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు తమ పిల్లలకు శాస్త్రపరిజ్ఞానాన్ని మాతృభాషలోనే బోధించి విజయం సాధించాయని, మనం కూడా మాతృభాషలోనే పిల్లలకు విద్య బోధించాలని, కరోనా కష్టకాలంలో రికార్డుస్థాయిలో మాస్కులు, రక్షణ పరికరాలు తయారుచేసిన ఘనత డిఆర్‌డిఓకు



దక్కుతుందని, లక్షల మందికి ఉపాధి కల్పించే చేనేత పరిశ్రమను రక్షించుకోవాలని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రపంచంలోని 100 సంస్థలను కలుపుకొని తెలుగు భాష అభివృద్ధికి తానా చేస్తున్న కృషిని అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుకు ఆదరణ తగ్గుతుందేమో కానీ విదేశాలలోని సంస్థలు మాత్రం తెలుగు పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్నాయని వారందరికీ అభినందనలు తెలుపుతున్నానని చెప్పారు. లోక్ సత్తా అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న కష్టకాలాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని దాన్ని తెలుగు భాషాభి వృద్ధికి కృషి చేస్తున్న తానావారిని అభినందించారు. ఆధునిక అవసరాలకు తగ్గట్టుగా భాష కొత్త పదాలను సృష్టించుకుని విస్తరించాలని లేకపోతే అది మృతభాష అవుతుందని, తెలుగు భాషకు నాలుగు వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉందని, ద్రావిడ భాషలకు తెలుగు భాష మూలమని, మాతృభాషలోనే బోధన చేయడం శాస్త్రీయమైన పద్ధతి అని ఆయన తెలియజేశారు. ఎపిఎన్ఆర్‌టీ చైర్మన్ వెంకట్ మేడపాటి మాట్లాడుతూ కోవిడ్ సమస్యలో కూడా అంతర్జాలంలో తానా చేస్తున్న కార్యక్రమాలు బావున్నాయని అంటూ తానా తెలుగు భాషకు చేస్తున్న కృషిని అభినందించారు.

తానా మాజీ అధ్యక్షులు జంపాల చౌదరి మాట్లాడుతూ, తానా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంపట్ల ఆనందాన్ని ప్రకటిస్తూ నిర్వాహకులను అభినందించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ భారతదేశంలో భారతీయులు మాట్లాడే రెండవ అతిపెద్ద భాష తెలుగు భాష. ఈ భాష ప్రపంచం మొత్తం విస్తరించింది. విభేదాలను వీడి తెలుగు భాషాపరిరక్షణ కోసం కృషి చేసి తెలుగు సంస్కృతిని ప్రపంచానికి దాటాలని అన్నారు. పద్మశ్రీ చింతకింది మల్లేశం మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఆసు మిషన్లు అందించి వేల కుటుంబాలను ఆదుకున్నందుకు తానావారికి ధన్యవాదాలు తెలియజేశారు. భారతీయం సత్యవాణి మాట్లాడుతూ మాతృభాష అభివృద్ధి కోసం తానాతో పాటు ఈ సంస్థలన్నీ చేస్తున్న ప్రయత్నాన్ని మనఃస్ఫూర్తిగా అభినందించారు. కార్యక్రమంలో మీగడ రామలింగస్వామి, గుమ్మడి గోపాలకృష్ణ ఇతర దేశాల్లో ఉన్న తెలుగు సంఘాల అధ్యక్షులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొన్న విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు.

## ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవం... వివిధ పోటీలు

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో జూలై 24,25,26 తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవం సందర్భంగా వివిధ రకాల పోటీలను నిర్వహించారు. దాదాపు 33రకాల పోటీలు... 40కిపైగా దేశాల నుంచి 18వేలమందికిపైగా అభ్యర్థులు ఇందులో పాల్గొన్నారు. సౌందర్యలహరి, తెలుగు వెలుగు, రాగమంజరి, నాదామృతం, అందెల రవళి, కళాకృతి, రంగస్థలం, భువనవిజయం పేరుతో కార్యక్రమాలను నిర్వహించి అందులో వివిధ రకాల పోటీలను ఏర్పాటుచేశారు. తెలుగు వెలుగు పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలుగుపద్యాలు, సామెతలు వివరణ, పరభాష లేకుండా తెలుగు పలుకు, తెలుగు కవితాగానం, చందమామ రావే కథలు చెప్పడం వంటివాటిపై పోటీలను ఏర్పాటుచేశారు. రాగమంజరి పేరుతో ఏర్పాటు చేసిన మరో కార్యక్రమంలో జానపద, శాస్త్రీయ సంగీతాలు, సినిమా, లలిత గీతాలపై పోటీలను నిర్వహించారు. నాదామృతం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వయోలిన్, తబల, వీణ, కీ బోర్డ్, మృదంగం, ఫ్లూట్ పోటీలు ఉన్నాయి. అందెల రవళి పేరుతో నిర్వ హించిన కార్యక్రమంలో జానపద, శాస్త్రీయ, పాశ్చాత్య నృత్య విభాగాల్లో పోటీలను నిర్వహించారు. రంగస్థలం పేరుతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏకపాత్రాభి నయం, మూకాభినయం,



ఇద్దరు లేదా ముగ్గురితో సన్నివేశ నటన వంటి వాటిపై పోటీలను నిర్వహించారు. భువన విజయం పేరుతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తెలుగు ఐక్యరాజ్యసమితి పేరుతో, తెలుగు యూనివర్స్ 2020 పేరుతో ఫ్యాషన్ షో కూడా ఏర్పాటుచేశారు. ఇండియన్ హ్యాండ్ లూమ్స్‌ను ప్రమోట్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకృతి పేరుతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. రంగవల్లి, చిత్రలేఖనం, అల్లికలు, వ్యంగ్య చిత్రలేఖనం, బంకమట్టి అచ్చులు, సైకత శిల్పాలు వంటి వాటిపై పోటీలను ఏర్పాటుచేశారు.

## తానా ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంపై చిరంజీవి వీడియో సందేశం

ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో జూలై 24 నుండి 26 వరకు మూడు రోజులపాటు జరిగిన ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని మెగాస్టార్ చిరంజీవి ఓ వీడియో ద్వారా వేడుకలు విజయవంతం కావాలంటూ సందేశమిచ్చారు.

తెలుగుభాష తెలుగు సంప్రదాయ సంస్కృతీ పరిరక్షణ కోసం ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమని చిరంజీవి పేర్కొంటూ, ప్రాచీన హోదాను దక్కించుకున్న తెలుగు భాష సంస్కృతిని కాపాడుకునేందుకు ఇలాంటి భాషా సాంస్కృతిక సంప్రదాయ సమ్మేళనాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఉద్యోగరీత్యా వృత్తిరీత్యా మీరందరూ ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ... తెలుగుభాష - తెలుగు సంస్కృతి సంప్రదాయ ఔన్నత్యం పట్ల మీరు చూపుతున్న చెక్కుచెదరని మీ అభిమానానికి నా అభినందనలు. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే అత్యధికమంది మాట్లాడే భాషగా తెలుగు 15వ స్థానంలో... భారత దేశంలో చూసుకుంటే హిందీ బెంగాలీ తర్వాత మూడో స్థానంలోను... ప్రస్తుతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అమెరికాలో హిందీ గుజరాతీ తర్వాత మూడో స్థానంలో వెలుగొందుతోంది మన తెలుగు అని కొనియాడారు.

స్వదేశంలో దేశ భాషలందు తెలుగు లెస్స అని... ప్రపంచంలో ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని ప్రశంసలు అందుకున్న భాష తెలుగు. ఈ కరోనా కష్టకాలంలో కూడా తెలుగు సంప్రదాయ విలువలు ముందు తరాల వారికి అందించేందుకు మీరు చేస్తున్న కృషికి చేతులెత్తి నమస్కరిస్తున్నానని చిరంజీవి తన సందేశంలో పేర్కొన్నారు.

## తానా - మంచి పుస్తకం నిర్వహణలో

# పదేళ్ల లోపు పిల్లల కోసం
# తెలుగులో బొమ్మల కథల పుస్తకాలు - 2021

ఉత్తర అమెరికా తెలుగు సంఘం – తానా (TANA) 23వ మహాసభలు 2021 జులై 2, 3, 4 తేదీలలో ఫిలడెల్ఫియా నగరంలో జరగబోతున్నాయి. ఈ సందర్భంగా తానా వివిధ సాహిత్య కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా బాలసాహిత్యాన్ని ప్రోత్సహించడం కోసం మంచి పుస్తకం (హైదరాబాద్) సంస్థతో కలిసి **పదేళ్లలోపు పిల్లల కోసం బొమ్మల కథలు–2021**కి రచనలు ఆహ్వానిస్తోంది.

**పుస్తకం:** పుస్తకం (1/4 క్రౌన్ సైజు, 18×24 సెం.మీ.) ఇన్నర్ టైటిల్, ఇన్ ప్రింట్ పేజీతో సహా 24 పేజీలు (పోర్ట్రేట్ లేదా ల్యాండ్‌స్కేప్‌లో) ఉండాలి, అదనంగా కవర్ పేజీలు ఉంటాయి.

**కథాంశం:** ఒక్కొక్క పేజీలో 10–12 వాక్యాలకు మించి ఉండకూడదు. కథ చదవటానికి సరదాగా, హాయిగా ఉండాలి; తమాషాగా అనిపించాలి. తల్లిదండ్రులు లేదా అన్న, అక్క చిన్న పిల్లలకు చదివి వినిపించేలా పుస్తకం ఉండాలి. నీతిని బోధించటమే కథ ప్రధాన ఉద్దేశంగా ఉండకూడదు. పిల్లలలో పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించేలా పుస్తకం ఉండాలి.

కథ, బొమ్మలు ఒకరే రాయ/గీయవచ్చు. లేదా కథ రాసేవాళ్లు, బొమ్మ వేసేవాళ్లు ఒక బృందంగా పనిచెయ్యవచ్చు. కథ మాత్రమే రాయగలిగి, బొమ్మలు వేసేవాళ్లు తెలియని వాళ్ల విషయంలో, ఆ కథ ఎంపికైతే బొమ్మలు వేయించే బాధ్యత మేం చేపడతాం.

**ప్రక్రియ:** ఇది 2 దశలలో ఉంటుంది:

**దశ–1:** కథ సారాంశం, నమూనా బొమ్మలు మాకు 2020 నవంబరు 30 లోపల అందచెయ్యాలి. ఈ దశలో ఎంపికైన కథలు రెండవ దశలోకి వెళతాయి.

**దశ–2:** ఈ దశకి సుమారు 10 కథా అంశాలను ఎంపిక చేస్తాం. ఒక పుస్తకానికి కథ రాసినవారికి, బొమ్మలు వేసిన వారికి పదివేల రూపాయల చొప్పున పారితోషికం ఇస్తాం. 2021 మార్చి 31 లోపల బొమ్మలతో పూర్తిచేసి, ముద్రణకు సిద్ధంగా ఉన్న పుస్తకాన్ని అందజేయాలి. ఈ పుస్తకాలన్నింటినీ తానా – మంచి పుస్తకం కలిసి 2021 జులై నాటికి ప్రచురిస్తాయి. కథ, బొమ్మలపై కాపీరైటు ఆయా రచయితలు, చిత్రకారులకే ఉంటాయి.

❖ నిర్వాహకుల నిర్ణయాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వివాదాలన్నింటినీ ఫిలడెల్ఫియా న్యాయపరిధిలో పరిష్కరించుకోవాలి.


రచనలు పంపించవలసిన / సంప్రదించవలసిన చిరునామా

**మంచి పుస్తకం, 12–13–439, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాదు 500017.**

**Email: info@manchipustakam.in**

**కె. సురేష్ – 99638 62926 & వాసిరెడ్డి నవీన్ – 98493 10560**


| జయ్ తాళ్లూరి | కన్నెగంటి చంద్ర | జంపాల చౌదరి | కె. సురేష్ |
|---|---|---|---|
| తానా అధ్యక్షులు | తానా ప్రచురణల కమిటీ ఛైర్మన్ | కార్యక్రమ నిర్వాహకులు | మంచి పుస్తకం |



*గాన సీమకు రారాజు సింహాసనం దిగిపోయాడు.*
*పగ్గాలు విడివడ్డ అశ్వాలకు మల్లే ఏడు స్వరాలు దిశను కోల్పోయి దిక్కులు చూస్తున్నాయి.*
*పల్లవీ చరణాలను నింపుకున్న తెల్ల కాగితాలు చిరిగి ఛిద్రమవుతున్నాయి.*
*అదిగో.. ఆ వంక తలలు మోదుకుంటున్న వాయిద్యాలు... ఇదిగో... ఈ పక్క బోరుమంటున్న హార్మోనియం మెట్లు..*
*ఇంతగా ఘనీభవించిన నిశ్శబ్దం ఎప్పుడూ చూల్లేదు. ఇంతటి శోకరాగం ఎప్పుడూ వినలేదు.*
*'పరవశాన శిరసూగంగా... ధరకు జారెనా శివగంగా...'*
*ఏ అమృత వర్షమో కురిసి పాట కళ్లు తెరిస్తే బాగుండు. ఏ దైవనాదమో దిగివచ్చి పాటను మేల్కొలిపితే బాగుండు. ఏ ప్రార్థనా ఫలితమో వెళ్లి సంజీవనిని పెకలించుకు వస్తే బాగుండు.*
*శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం అను గాన గంధర్వుడా... తెలుగు నేల గన్న ప్రియపుత్రుడా.. సంగీత శిఖరమా... లలిత కళాభాండమా... తెలుగువారి ఆకాశాన అనంతమైన నీ పాటలను తారలుగా గుచ్చి వెళ్లి పోయావా...*
*సెలవు ధన్యుడా... సెలవు...*
*తెలుగు పాట నిన్ను సువర్ణ గండపెండేరంలా ధరించి సదా వెలుగుతూ ఉండనీ.*

## సినిమా పాటకు శంకరాభరణం

# శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం

దాదాపు అయిదున్నర దశాబ్దాలపాటు సినీ సంగీత ప్రపంచాన అసాధారణమైన, అనితరసాధ్య మైన ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించి భూగోళం నాలుగు చెరగులా కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న గాన గంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం సెప్టెంబర్ 25న కన్ను మూశారు.

1946 జూన్ 4న నెల్లూరు జిల్లా కోనేటమ్మ పేటలో శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు జన్మించారు బాల సుబ్రహ్మణ్యం.

సినీ నేపథ్య గాయకుడిగా శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న (1966) చిత్రం ద్వారా పరిచయమయ్యారు బాలు. ఈ చిత్రానికి ఎస్.పి. కోదండపాణి సంగీత దర్శకత్వం వహించారు. తనకు సినీ గాయకునిగా జీవితాన్ని ప్రసాదించిన కోదండపాణిపై అభిమానంతో తాను నిర్మించిన ఆడియో ల్యాబ్‌కు 'కోదండపాణి ఆడియో ల్యాబ్స్' అని పేరు పెట్టారు బాలు.

తెలుగింట పుట్టిన ఒక అద్భుతం బాల సుబ్రహ్మణ్యం. సంగీతంలో ఆయన కన్నా నిష్ణాతులు ఉండొచ్చు. చాలాసార్లు తానే చెప్పుకున్నట్టు ఆయన కన్నా గొప్ప గాయకులు ఉండొచ్చు. కానీ ఏక కాలంలో భాషనూ, నుడికారాన్ని, పదాల విరుపును, అందులోని సంస్కారాన్ని అంత బాగా ఒడిసి పట్టుకో గలిగే నిష్ణాతుడు మరొకరుండరు. మాతృభాషలో మాత్రమే కాదు... తాను పాడిన దాదాపు 18 భాష ల్లోనూ, 41 వేల పాటల్లోనూ ఆయన ఈ నియమం

పాటించారు. కెరీర్ మొదట్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్మెస్ విశ్వనాథన్ తమిళ సినిమాలో పాడే అవకాశం ఇచ్చినప్పుడు చెప్పిన మాటను ఆయన చివరి వరకూ తుచ తప్పకుండా పాటించారు. 'పాట బాగా పాడావుగానీ, ఉచ్చారణ సరిగ్గా లేదు. తమిళం నేర్చుకుని రా' అని ఆయన చెప్పారట. ఏడాదిపాటు ఆ భాషను ఔపోసన పట్టి, ఆయనతోనే శభాష్ అనిపించుకుని మరీ తమిళంలో పాడారు. అప్పటి నుంచి తాను పాడే పాట ఏ భాషదైనా దాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకుని, అవగాహన చేసుకునేవారు. కనుకనే ఏ భాష మాట్లాడేవారైనా బాలును తమ వాడిగా భావించారు.

ఆయన పాట పండిత, పామర జనరంజకం కావడం... చిత్ర విజయానికి అది దోహదపడటం గమనించి ఆయన కోసం నిర్మాతలు, సంగీత దర్శకులు క్యూ కట్టేవారు. తాను పాట పాడాల్సిన నటుడెవరో తెలుసుకుని, వారి పాత్రేమిటో ఆరా తీసి, వారి గాత్రాన్ని అవగాహన చేసుకుని అచ్చం వారే పాడుతున్న అనుభూతి కలిగించడానికి బాలు చేసిన ప్రయత్నం అనితరసాధ్యం. బాలుకు ముందు ఈ ప్రయత్నం చేసినవారు దాదాపు లేరు. కనుకనే అన్ని తరాల కథానాయకులూ బాలూనే ఎంచుకునేవారు. రాజబాబు, అల్లు రామలింగయ్యవంటి హాస్య నటులు, కైకాల వంటి కేరెక్టర్ ఆర్టిస్టులు ఇలా అందరిలోనూ ఆయన గాత్రం ఒదిగిపోయేది. అది భక్తిరసాన్ని ఒలికించే పాటైనా, విస్ఫులింగాల్ని వెదజల్లే పాటైనా, అది ఆర్ద్రతను చాటే పాటైనా, ఆవేశాన్ని రగిల్చే పాటైనా... నవరసాలూ ఆయన గళం పలికేది. ఆయన గొంతు పలికే వరకూ పాటలో సైతం ధ్వన్య నుకరణ సాధ్యమని ఎవరికీ తెలియదు. ఆ అరుదైన కళ ఆయన నోట పాటనే కాదు... సంభాషణల్ని కూడా పలికించింది.

1990లో *కేలడి కన్మణి* సినిమా (తెలుగులో *ఓ పాపా లాలి*)లో లీడ్ రోల్ చేశారు. *ప్రేమికుడు, పవిత్రబంధం, ఆరోప్రాణం, రక్షకుడు, దీర్ఘ సుమంగళీభవ* వంటి చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించారు.

*దేవస్థానం, మిథునం* చిత్రాల్లో ముఖ్యభూమిక లో కనిపించారు. బాలచందర్ తమిళ చిత్రం *మన్మధ లీలై* తెలుగు డబ్బింగ్ *మన్మధ లీల*తో డబ్బింగ్ ఆర్టిస్ట్ అయ్యారు.

కమల్‌హాసన్, రజనీకాంత్, సల్మాన్‌ఖాన్, విష్ణు వర్ధన్, గిరీష్ కర్నాడ్, అర్జున్, నగేష్, రఘువరన్ వంటి నటులకు గాత్రదానం చేశారు. 1977లో వచ్చిన *కన్యా కుమారి* సినిమాతో సంగీత దర్శకుడిగా మారారు.

తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో సుమారు 46 సినిమాలకు సంగీతం సమకూర్చారు. నిర్మాతగా *యోధ, భామనే సత్యభామనే, తెనాలి, శుభసంకల్పం* వంటి సినిమాలు నిర్మించారు. *హలో బ్రదర్*ను ఆయన బ్యానర్ ద్వారా తమిళంలోకి అను వదించి నాగార్జునకు డబ్బింగ్ కూడా చెప్పారు.

ఉత్తమ గాయకుడిగా ఆరుసార్లు జాతీయ అవార్డు అందుకున్నారు. 1979లో సంగీత ప్రధానంగా వచ్చిన *శంకరాభరణం* చిత్రానికిగాను ఆయన తొలి జాతీయ అవార్డు అందుకున్నారు.

ఆ తర్వాత 1981లో హిందీ చిత్రం *ఏక్ ధూజే కేలియే*, 1983లో *సాగర సంగమం*, 1988లో *రుద్ర వీణ*, 1995లో కన్నడ చిత్రం *సంగీతసాగర గానగోయి*

***శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న చిత్ర రికార్డింగ్ సమయంలో...***







పంచాక్షర గవై, 1996లో తమిళ చిత్రం మిన్‌సార కనవు చిత్రాలకు జాతీయ అవార్డు అందుకున్నారు. 25 నంది అవార్డులు దక్కాయి.

భారతీయ సినిమాకు ఆయన అందించిన సేవలకుగాను 2001లో పద్మశ్రీ, 2011లో పద్మ భూషణ్ అవార్డులను అందుకున్నారు. 2012లో ఎన్టీఆర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. 2016లో 'ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్' అవార్డు తీసుకున్నారు. 1999లో పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇంకా తమిళ, కన్నడ తదితర రంగాల నుంచి పలు అవార్డులు అందుకున్నారు.

2009 తానా మహాసభల సందర్భంగా తానా జీవనసాఫల్య పురస్కారంతో బాలసుబ్రహ్మణ్యంను సత్కరించింది.

మనం సినిమాలోనో, రేడియోలోనో, టీవీ చానెల్‌లోనో ఒకటికి పదిసార్లు విన్న పాటే అయినా... భిన్న వేదికలపై అదే పాట పాడిన ప్రతిసారీ ఎప్పటి కప్పుడు కొత్త కొత్త సంగతులను నింపి, అద్భుత స్వరా లాపనతో ఆహూతుల్ని మంత్రముగ్ధుల్ని చేయడం ఒక్క బాలూకు మాత్రమే సాధ్యం. కర్ణాటక సంగీత దిగ్గజం బాలమురళీకృష్ణ చాలా తరచుగా, 'నాకు సంగీతం పెద్దగా తెలియదండీ... కానీ సంగీతానికి నేను తెలుసును' అనేవారు. బాలసుబ్రహ్మణ్యం లోనూ అదే వినమ్రత ఉట్టిపడేది. ప్రఖ్యాత దర్శకుడు కె. విశ్వనాథ్, సంగీత దర్శకుడు కేవీ మహదేవన్ ఆయన్ను ఆ వినమ్రత నుంచి బయటకు తీసుకురాక పోయివుంటే *శంకరాభరణం* వంటి కళాఖండం సాధ్య మయ్యేది కాదు. ఆ చిత్ర ఇతి వృత్తంతోపాటు బాలూ గొంతునుంచి జాలువారిన పాటలన్నీ దాని ఘన విజయానికి తోడ్పడ్డాయి. సామాన్యులకు సైతం సంగీతంపై ఆసక్తినీ, అనురక్తినీ కలిగించాయి.


చిన్ననాటి నుంచే వేదికలపై నిర్భయంగా మాట్లాడటం, పాడటం అలవాటైంది కనుక కొత్తగా తోసుకొచ్చిన బుల్లితెర మాధ్యమం కూడా ఆయనకు ఇట్టే పట్టుబడింది. అంతకు చాన్నాళ్లముందు ఆయన వివిధ నగరాల్లోనూ, పట్టణాల్లోనూ ఆర్కెస్ట్రాతో ప్రదర్శనలిచ్చిన సందర్భాలున్నాయి. అలాంటి సమయాల్లో తాను పాడే పాటలోని సాహిత్యాన్ని, అందులోని సొబగుల్ని, ఆ పాట సందర్భాన్ని చమత్కారభరితంగా చెప్పడం, చెణుకులేయడం ఆయనకు అలవాటు. దాన్నే బుల్లితెరపై కూడా కొనసాగించి తెలుగుపాటను అజరామరం చేశారు. పాడుతా తీయగా, ఎందరో మహానుభావులు, పాడాలని ఉంది వంటి కార్యక్రమాలతో వందలాది మంది ప్రతిభాశాలురను తీర్చిదిద్దిన ఘనత ఆయనదే.

చివరివరకూ పాట కోసం పరితపించి, ఆ క్రమం లోనే అనారోగ్యానికి లోనై, కానరాని తీరాలకు వెళ్లి పోయిన బహుముఖ ప్రజ్ఞాశాలి బాల సుబ్రహ్మణ్యం స్మృతికి తానాపత్రిక నివాళులర్పిస్తోంది.

*సాక్షి దినపత్రిక సౌజన్యంతో*

www.digitaltimes.co

# What's Next For You?



**Leverage Our Digital Marketing Expertise for Your Business Evolution With The times**

- Content Marketing
- Position 0 & Next Gen SEO
- Lead Gen to Door Knocks
- E-commerce Multiplication

Google Partner
facebook for business
Microsoft Gold Partner
DIGITAL TIMES

Encinitas, USA; Hyderabad & Bangalore, India | hello@digitaltimes.co
**+91 98480 16666 +1 424-253-0800**

నివాళి...



❖ పన్యాల జగన్నాథ దాసు

# ఈ పాదం నటరాజుకే అంకితం

## కూచిపూడి నాట్యమయూరి

# శోభానాయుడు



**ఆమే సత్యభామ. ఆమే చండాలిక. ఆమే దుర్గ. ఆమే దేవదేవి. ఆమె కోసమే కూచిపూడి రూపుదిద్దుకుంది. కూచిపూడి కోసమే ఆమె జన్మించింది. ఒక నృత్యకారిణి, భారతీయ స్త్రీ సుదీర్ఘంగా కళారంగంలో కొనసాగాలంటే ఎంతో సంకల్పం... మరెంతో అంకితభావం ఉండాలి. తనకు అవి ఉన్నాయని ఆఖరి శ్వాస వరకూ నిరూపించిన నాట్యవిదుషీమణి శోభానాయుడు. నేడు ఆమె వేదిక దిగి వెళ్లిపోయారు. మువ్వలు మూగపోయాయి. తెలుగువారి నాట్యం ఈ ధ్రువతారకు సదా రుణపడే ఉంటుంది.**





అవిశ్రాంతంగా నాట్యకళకే అంకితమైన ఆమె పాదాలు దివిలో నర్తించడానికి పయనమయ్యాయి. తెలుగువారి నృత్యరీతికి జీవితాన్ని ధారపోసిన ఆమె ప్రయాణం ఇకపై మరోలోకంలో కొనసాగనుంది. శోభానాయుడు అనే అసలు పేరును, కూచిపూడి మహారాణి అనే ముద్దుపేరును కలిగిన ఆ నాట్య శిరోమణి ఒక జీవితకాలంలో పది జీవితకాలాల కృషిని చేసింది.

శోభానాయుడు జీవితాన్ని తరచి చూస్తే కూచిపూడి కోసం ఆమె ఎంత నిబద్ధతతో పనిచేశారో తెలుస్తుంది. ఆమె కూచిపూడి మీద ప్రేమతో ఇతర నాట్యరీతులను కూడా నేర్చుకోలేదు. సినిమా అవకాశాలను సైతం తృణీకరించారు. ఆమె ఆరోప్రాణం మాత్రమే ఆమెది. పంచప్రాణాలూ కూచిపూడే.

శోభానాయుడు 1956లో విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో పుట్టారు. రాజమండ్రిలో పెరిగారు. తండ్రి వెంకటరెడ్డి ఇంజినీరు. తల్లి సరోజమ్మ గృహిణి. తండ్రికి నృత్యాలు, కళలు అంటే పెద్దగా ఇష్టముండేది కాదు. చిన్నప్పటి నుంచి నృత్యంపై మక్కువ పెంచుకున్న కూతురి నైపుణ్యాన్ని గ్రహించి తల్లి సరోజమ్మ ప్రోత్సహించారు. సరైన శిక్షణ ఇప్పిస్తే రాణించగలదనే నమ్మకంతో తొలుత రాజమండ్రిలోని నాట్యాచార్యుడు పి.ఎల్.రెడ్డి వద్ద శిక్షణ ఇప్పించారు. శోభానాయుడు తొమ్మిదో తరగతిలో ఉండగా, మెరుగైన శిక్షణ కోసం సరోజమ్మ ఆమెను మద్రాసు తీసుకువచ్చి, వెంపటి చినసత్యం వద్ద చేర్పించారు. వెంపటి చినసత్యం వద్ద శోభానాయుడు గురుకుల పద్ధతిలో శిక్షణ పొందారు. ఆమె భర్త అర్జునరావు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఆమె కుమార్తె శివరంజని తల్లి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని కూచిపూడి నర్తకిగా రాణిస్తున్నారు.

శోభానాయుడు అరంగేట్రం ప్రదర్శనను ఆద్యంతం తిలకించిన ప్రఖ్యాత నర్తకి, భరతనాట్య దిగ్గజం రుక్మిణీదేవి అరండేల్ ముగ్ధులయ్యారు. 'సినిమాల వ్యామోహంలో చిక్కుకోవద్దు. కూచిపూడి ప్రక్రియకే అంకితమై కృషిని కొనసాగిస్తే నాట్య రంగానికి ఎనలేని సేవ చేయగలవు,' అంటూ ఆశీర్వదించారు. రుక్మిణీదేవి అరండేల్ సలహాను శోభానాయుడు అక్షరాలా పాటించి, పూర్తిగా కూచిపూడి నృత్యానికే అంకితమయ్యారు. తన గురువు వెంపటి చినసత్యం బృందంతో కలసి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వివిధ వేదికలపై లెక్కలేనన్ని ప్రదర్శనలు ఇచ్చారు. పలు నృత్యరూపకాల్లో కీలక పాత్రలు ధరించి, తన నృత్యాభినయంతో ప్రేక్షకుల మనసుల్లో



చెరగని ముద్ర వేశారు. కూచిపూడి నృత్యరీతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలోనూ ఆమె చిరస్మరణీయమైన కృషి చేశారు.

నృత్య రంగానికి శోభానాయుడు చేసిన కృషిని గౌరవిస్తూ విశాఖపట్నం కళాకారులు ఆమెను పురవీధుల్లో ఊరేగించి, పల్లకీ మోశారు.

శోభానాయుడు 'భామాకలాపం'తో ఖ్యాతి పొందారు. సత్యభామగా ఆమె ప్రదర్శించే శ్రీకృష్ణ పారిజాతం రూపకంలో భర్త అయిన కృష్ణుడి మీద దాచుకోవాలనిపించేంత ప్రేమ, తనమీద అతడి ప్రేమను మరొకరు పంచుకుంటున్నారన్న కోపం దూరంగా నెట్టేస్తూనే దగ్గరకు తీసుకోవాలన్న ఆత్రం... ఇవన్నీ ఆమె సత్యభామ పాత్రలో అద్భుతంగా చూపిస్తారు.

*శ్రీనివాస కళ్యాణం, శ్రీకృష్ణ శరణంమమ, చండాలిక, మేనక విశ్వామిత్ర, విప్రనారాయణ, విజయోస్తు నారీ, గిరిజాకళ్యాణం,* స్వామి వివేకానంద వంటి దాదాపు పదహారు నృత్యరూపకాలను, నృత్యనాటికలను శోభానాయుడు తన బృందంతో కలసి దేశ విదేశాలలో పలు జాతీయ, అంతర్జాతీయ వేడుకల్లో లెక్కకు మిక్కిలిసార్లు ప్రదర్శించారు. ఎన్నో సోలో ప్రదర్శనలూ ఇచ్చారు. 'సత్యభామ' పాత్రలో చేసే అభినయానికి ఆమెకు ఎంతో పేరు వచ్చింది.



ద్రౌపదీ వస్త్రాపహరణం నృత్య నాటికలో అన్ని పాత్రలనూ తానే అభినయిస్తూ చేసే ప్రదర్శన విమర్శకుల ప్రశంసలు పొందింది.

ఎన్నో అవకాశాలు తనను వెదుక్కుంటూ వచ్చినా శోభానాయుడు ఏనాడూ సినిమా వ్యామోహంలో చిక్కుకోలేదు. పదహారేళ్ల వయసులో అభిమానవంతులు (1973) సినిమాలో 'ఎప్పటివలె కాదురా నా స్వామి... ఎప్పటివలె కాదురా' అనే పాటలో వెండితెరపై మెరిసిన శోభానాయుడు కూచిపూడి నాట్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలనే తన ఆశయానికి ఆటంకం కాగలవనే కారణంతో సినిమా అవకాశాలను వదులుకున్నారు. తన గురువు వెంపటి చినసత్యం నృత్య దర్శకత్వం వహించిన కొద్ది చిత్రాలకు సహాయ నృత్యదర్శకురాలిగా పనిచేశారు.




కూచిపూడి నృత్య సంప్రదాయంలో దాదాపు ఐదు శతాబ్దాలు పురుషులే నాట్యాచార్యులుగా ఏలారు. శోభానాయుడు సాగించిన నిరుపమానమైన కృషి ఫలితంగానే ప్రస్తుతం ఎందరో మహిళలు కూచిపూడి నాట్యాచార్యులుగా రాణిస్తున్నారు. హైదరాబాద్‌లోని కూచిపూడి నృత్య అకాడమీ ప్రిన్సిపాల్‌గా 1981లో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆమె వందల సంఖ్యలో శిష్యులను తీర్చిదిద్దారు. ఆమెకు దాదాపు 1500 మంది శిష్యులు ఉన్నారు. ఆ శిష్యుల్లో కొందరు దేశ విదేశాల్లో కూచిపూడి నృత్య అకాడమీని శాఖోపశాఖలుగా విస్తరించారు.

సంప్రదాయ నృత్యరంగంలో ఆమె సాగించిన కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆమెను 2001లో 'పద్మశ్రీ'తో సత్కరించింది. మద్రాసులోని కృష్ణ గాన సభ నుంచి నృత్య చూడామణి, సంగీత నాటక అకాడమీ అవార్డు, నృత్యకళా శిరోమణి, ఎన్టీఆర్ అవార్డు వంటి ఎన్నో అవార్డులు ఆమెను వరించాయి.



ఎన్నో చేదు జ్ఞాపకాలను ఇచ్చిన ఈ పాడు సంవత్సరం ఆమెను తీసుకుపోయి తెలుగువారిని నిజంగా వంచించింది. ఇది క్షమార్హం కాని కాలం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక సౌజన్యంతో*



# గాంధీ జయంతి

అక్టోబర్ 2 వ తారీఖున ప్రపంచవ్యాప్తంగా గాంధీ జయంతిని జరుపుతారు .ఈ సంవత్సరం తానా గాంధీ జయంతిని ఎంతో ఆకర్షణీయంగా నిర్వహించింది. ఉదయం 8 గం.కు/IST/ 10:30PM ESTకి ప్రారంభమైన ఆన్‌లైన్ కార్యక్రమాన్ని తానా కార్యదర్శి రవి పొట్లూరి ప్రారంభించగా విమెన్ కో-ఆర్డినేటర్ శిరీష తూనుగుంట్ల తన ఉపన్యాసంతో వక్తల్ని ఆహ్వానించారు. ఆ తరువాత వ్యక్తలందర్నీ సభకు పరిచయం చేశారు. సభను ప్రారంభించిన తానా అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి తన అధ్యక్ష ఉపన్యాసంలో గాంధీజీ స్వాతంత్రోద్యమంలో నిర్వహించిన అనితరసాధ్యమైన పాత్రను శ్లాఘించారు. అటువంటి మహాత్ముడు ఈ భూమిమీద పుట్టడం దుర్లభమని కొనియాడారు. ఆ తరువాత మాట్లాడిన తోటకూర ప్రసాద్ అమెరికాలో గాంధీ పార్కు, విగ్రహం ఏర్పాటు గురించి తన అనుభవాల్ని నెమరువేసుకున్నారు. శాసనమండలి సభ్యుడు శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ సౌత్ ఆఫ్రికాలో ఎదుర్కొన్న వివక్షత ఎలా తనను ఒక నాయకుడిగా తీర్చిదిద్దినదో సోదాహరణంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అంజయ్య చౌదరి లావు ఉపన్యసించారు. తనకు గాంధీజీ, డా॥ బి.ఆర్. అంబేడ్కర్- ఇద్దరు ఆరాధ్యనీయులని చెబుతూ, గాంధీజీలో కాలక్రమేణా దళితులపట్ల వచ్చిన సానుకూల దృక్పథాన్ని వివరించారు.

తర్వాత ప్రసంగించిన పూర్వ వైస్ ఛాన్సలర్ బాలమోహన్‌దాస్, మనిషి మహాత్ముడెలా కాగలడో తన జీవితం ద్వారా గాంధీ నిరూపించారని చెప్పారు. పూర్వ ఉపసభాపతి డా॥ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తనపై బాల్యం నుండి ఏర్పడిన గాంధీ ప్రభావాల్ని, తన ఊరిలో తండ్రి మండలి వెంకటకృష్ణారావు ఏర్పాటుచేసిన 'గాంధిక్షేత్రం' గురించి తెలియజేశారు. గాంధీ సింగ్ ఫౌండేషన్ అధ్యక్షులు డా॥ రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు మానవాళికి ఎప్పటికి శిరోధార్యమని తెలిపారు. పూర్వ సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ విజయ్‌భాస్కర్ గాంధీజీ పై చిన్నతనం నుండి పడిన అనేక మతాల ప్రభావాన్ని, ఆ తర్వాత టాల్‌స్టాయ్ నుండి ఝాన్ రస్కిన్ వరకు ఆయన సిద్ధాంతాలని ఎలా ప్రభావితం చేశాయో చెప్పారు. గాంధీ సింగ్ ఫౌండేషన్ కార్యదర్శి గొల్లనపల్లి ప్రసాద్ తానా సహకారంతో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామన్నారు. దానికి తానా ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, భవిష్యత్తులో జరిగే కార్యక్రమాల్లో అంతర్జాతీయ ప్రసిద్ధిగల వక్తల్ని ఆహ్వానిద్దామని తానా ఫౌండేషన్ చైర్మన్ నిరంజన్ శృంగవరపు తెలియజేశారు.

గాంధీ వ్యక్తిత్వం, పోరాటం, సిద్ధాంతాలకు పట్టంగడుతూ రెండున్నర గంటల కార్యక్రమానికి ముగింపుగా విమెన్ కో-ఆర్డినేటర్ శిరీష తూనుగుంట్ల వందన సమర్పణ చేసి, కార్యక్రమ నిర్వహణలో తోడ్పడిన తానా న్యూయార్క్ ఆర్.సి. సుమంత్ రాంశెట్టి మరియు తానా కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# Enjoy Araku Boomi Instant Coffee


- Arabica Beans from Araku Valley
- Award Winning Beans
- Quality Highly Ranked by Specialty Coffee Association
- No Chicory. 100% Pure Coffee
- Tastes like Filter Coffee

**Available at your local Indian stores.**

araku boomi instant coffee




wecare@boomicoffee.com
boomicoffee.com



# ఘనంగా గుర్రం జాషువా 125వ జయంతి ఉత్సవాలు నిర్వహించిన తానా


ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సాహిత్య విభాగం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా 125వ జయంతి ఉత్సవాలు అంతర్జాలంలో ఘనంగా నిర్వహించగా పలు దేశాల నుండి సాహితీప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తానా అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్ మాట్లాడుతూ, గానగంధర్వులు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారి మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటని, ఆయన తానా జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారని, బాలూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సెప్టెంబర్ 21వ తేదీన గురజాడ అప్పారావు జయంతి అని అలాంటి మహాకవి తెలుగునేలపై పుట్టటం జాతికే గర్వకారణమన్నారు.

గుర్రం జాషువా జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తూ... గుర్రం జాషువా చిన్ననాటి నుంచి అంటరానితనం, పేదరికాన్ని చవి చూశారని, సామాజిక, ఆర్థిక అసమానతల పై అలుపెరుగని పోరాటం చేశారని, ఎక్కడ అవమానాలకు, అవహేళనకు గురి అయ్యారో, అక్కడే వెయ్యికి పైగా సత్కారాలు, సన్మానాలు, పద్మవిభూషణ్ పురస్కారాలు పొందారన్నారు.

తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా॥ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ, “వెయ్యేళ్ల సాహిత్యచరిత్రలో గుర్రం జాషువాది ప్రత్యేక స్థానమని, అట్టడుగు వర్గాల గాథలకు పట్టంకట్టి, గౌరవం కలానికా, కులానికా అంటూ సూటిగా ప్రశ్నిస్తూ, ఒక



ప్రక్క దుర్భర దారిద్ర్యం, వర్ణవ్యవస్థ, కులమత భేదాలు ఎదుర్కొంటూ మరోప్రక్క గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర, క్రొత్తలోకం వంటి అద్భుత కావ్యాలను రచించిన మహాకవి జాషువా సాహిత్యం అజరామరం అన్నారు.

వేదిక సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగు సాహిత్య చరిత్రలో జాషువాది ప్రత్యేకమైన స్థానం అని కొనియాడారు.

ప్రఖ్యాత గాయకులు ప్రవీణ్ కొప్పోలు జాషువా పద్యాలను మధురంగా పాడి వీక్షకులను అలరించారు.


ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ, జాషువా కులమతాలను దాటి విశ్వనరుడుగా తనను తాను పరిచయం చేసుకున్నాడని, ఆయనంత మానవతావాది, నవతావాది మరొకరు ఉండరని అన్నారు.

డా॥ జి. సమరం, జాషువాతో తమకున్న బంధుత్వాన్ని, వ్యక్తిగత అనుబంధాన్ని నెమరువేసు కోవడమే కాక, జాషువా కవితా వైభవాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు.

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, జాషువా సాహిత్యానికి తాను సేవకుడినని, ప్రచారకుడినని, జాషువా వీరాభిమానిని అని, జాషువా కవిత్వం పై మరింత చర్చ జరగాలని, ప్రచారం జరగాలని ఆ దిశగా తాము కృషి చేస్తున్నామన్నారు.

హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాచార్యులు ఎండ్లూరి సుధాకర్ జాషువా 'గబ్బిలం' కావ్యం పై సమగ్రమైన విశ్లేషణాపూర్వక ప్రసంగం చేశారు.

తిరుపతిలోని శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి 'ఫిరదౌసి' కావ్యంపై వివరణాత్మక ప్రసంగం చేశారు.




ఖమ్మం జిల్లా 'గుర్రం జాషువా సాహిత్య వేదిక' అధ్యక్షులు మువ్వా శ్రీనివాస్ జాషువా కవిత్వం ప్రాసంగికత మీద అద్భుత విశ్లేషణ చేశారు.

తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డా॥ ప్రసాద్ తోటకూర తన మలి పలుకులలో ప్రతి నెలా ఆఖరి ఆదివారం (భారత కాలమానం ప్రకారం రాత్రి 9:30 గంటకు) తప్పనిసరిగా ఒక సాహిత్య కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిధులకు, ప్రపంచవ్యాప్తంగా వీక్షించిన సాహితీ ప్రియులకు, సభ విజయవంతం గావడానికి తోడ్పడిన బైట్‌గ్రాఫ్స్ అధినేత ప్రశాంత్ కొల్లిపరకు, ప్రసార మాధ్యమాల నిర్వాహకులు చిల్లర శ్రీధర్‌కు, తానా కార్యవర్గ సభ్యుడు సుమంత్ రామిశెట్టిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పూర్తి వివరాలకు www.tana.orgను సందర్శించవచ్చు. ❀








# గురువందనం

తానా ఇటీవల అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అధ్యక్షుడు జయశేఖర్ తాళ్లూరి ఆధ్వర్యంలో, ఉమెన్ కో-ఆర్డినేటర్ శిరీష తూనుగుంట్ల సారథ్యంలో ఇండియా, ఆస్ట్రేలియ, సౌత్ ఆఫ్రిక, న్యూజిలాండ్, కతార్, సౌదీ అరేబియా, కువైట్, ఒమెన్, స్కాట్‌లాండ్, ఇంగ్లండ్, లండన్, డెన్మార్క్ మొదలగు దేశాల్లోని 40 తెలుగు సంఘాలు గురువందనం కార్యక్రమాన్ని ఎంతో విలక్షణంగా 12 గంటలు నిర్వహించారు. ఈ 'గురు వందనం' కార్యక్రమం ముందుగా అమెరికాలో ప్రారంభించి ఆ తరువాత పాల్గొన్న ప్రతి దేశానికి అరగంట కాలాన్ని కేటాయించారు. ఒక దేశం తరువాత ఒక దేశం పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారికి అంజలి ఘటించి ఒక చక్రభ్రమణంలా ఎంతో విలక్షణంగా సాగింది. భారతదేశ రెండవ రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సెప్టెంబర్ 5వ తారీఖున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. కోవిడ్-19 ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉన్న నేపథ్యంలో ఈ కార్యక్రమం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ డా॥ కరణం అరవింద్‌రావు, ఆచార్యా నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ఆచార్య వి. బాలమోహన్‌దాస్, రష్యాలోని కూచిపూడి గురువు అన్నా మేషకను ఈ సందర్భంగా గౌరవించి గురు వందనం సమర్పించారు.

ఈ సందర్భంగా మనిషి జీవితంలో గురువు ప్రాధాన్యతను గురించి తెలియజేశారు. మన సనాతన ధర్మంలో గురువు ఎలా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దారో అరవిందరావు వివరించగా, ఆధునిక యుగంలో గురుశిష్యుల సంబంధం ఎలా ఉందో బాలమోహన్ దాస్ తెలియజేశారు. అన్నా మేషక్ ఇది తనకు



అపూర్వ గౌరవమని, తన కృషికి గుర్తింపు అని ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా తానా అధ్యక్షుడు జయ్ తాళ్లూరి తన చిన్నతనంలో తనకు విద్య నేర్పిన గురువులను గుర్తుచేసుకుంటూ మహబూబ్‌నగర్‌లో గల తన చిన్ననాటి గురువుతోను బాల్యస్నేహితుల తోను మాట్లాడి గతస్మృతుల్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తానా ఫౌండేషన్ అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, శ్రీనివాస్ కలశపూడి, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ పూర్వసంచాలకులు దీర్ఘాశి విజయ్ భాస్కర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ఆద్యంతమూ ఆసక్తిగ నిర్వహించిన శిరీషా తూనుగుంట్లను, ఒహాయో వ్యాలీ రీజనల్ కో-ఆర్డినేటర్ శ్రీని యలవర్తి, నార్త్ కాలిఫోర్నియా రీజనల్ కో-ఆర్డినేటర్ రజనీకాంత్ కాకర్లలను అందరూ అభినందించారు.

## తెలుగు పేద కళాకారులకు తానా ఆర్థిక సహాయం

తానా జులై 24 నుండి ఆగష్టు 2 వరకు ప్రపంచ తెలుగు సాంస్కృతికోత్సవాల్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 18,023 మంది పాల్గున్నారు. 40 దేశాల్లోని 100 తెలుగు సంఘాలు భాగస్వాములయ్యాయి.

ఆనాడు ఈ మహోత్సవంలో పాల్గొన్న తెలుగు కళాకారులు, తానా అధ్యక్షుడు జయ తాళ్లూరి దృష్టికి కరోనా మహమ్మారి వలన పడుతున్న ఇబ్బందుల్ని తీసుకువచ్చి, ఏదైనా సహాయం చేయమని కోరారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన తానా అధ్యక్షుడు జయ్ తాళ్లూరి, ఉమెన్ కో-ఆర్డినేటర్ శిరీష తూనుగుంట్ల ఒక ఆన్‌లైన్ సమావేశాన్ని ఏర్పాటుచేసి కళాకారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో తానా ఫౌండేషన్ చైర్మన్ నిరంజన్ శృంగవరపు, తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అంజయ్య చౌదరి లావు కూడా పాల్గొన్నారు.

ఈ సమావేశానంతరం వందమంది కళాకారులకు ఒక్కొక్కరికి 2 వేల రూపాయల చొప్పున వారి అకౌంట్లకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆపద సమయంలో ఇలా ముందుకొచ్చి తానా చేస్తున్న సహాయానికి కళాకారులు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.




❖ సుధా చక్రవర్తుల

# ఆంధ్ర భీముడు... దండమూడి రాజగోపాలరావు

ఆటల పోటీల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన కొద్దిమంది భారతీయుల్లో దండమూడి రాజగోపాల రావు ఒకరు. మనదేశం స్వాతంత్ర్యం పొందిన తొలి నాళ్లయిన 1948లోనే మిస్టర్ ఆసియాగా గెలిచి భారతజాతికి వన్నెతెచ్చిన ఘనుడాయన. శరీర సౌష్టవ పోటీలో మిస్టర్ ఆసియా బిరుదును పొందిన తొలి ఆంధ్రుడే కాక తొలి భారతీయుడు దండమూడి రాజ గోపాలరావు.

దండమూడి రాజగోపాలరావు తొలి అంకంలో కొల్లి రామదాసు, సోమయాజులు తదితరుల వద్ద తర్ఫీదు పొంది 1938లో తొలిసారిగా పోటీల్లో పాల్గొని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ కావడం ద్వారా శరీర సౌష్టవంపై దృష్టి పెంచారు. ఫలితంగా 1940లో మొదటిసారిగా రాష్ట్రస్థాయిలో చాంపియన్‌గా గెలుపొందారు.



దండమూడి 1942లో కేరళ టైటిల్‌ను, 1944లో బాంబే ప్రావిన్షియల్ గౌరవాలను మునుపటి రికార్డులన్నింటినీ తిరగరాసి చేజిక్కించుకున్నారు. 1945లో జాతీయస్థాయిలో 320 పౌండ్ల బరువు ఎత్తి విజేతగా నిలిచారు దండమూడి. 1946లో హెవీ వెయిట్ పోటీలలో బెంగళూరులో జరిగిన ఒలింపిక్ స్పోర్ట్స్ ఈవెంట్ ఆఫ్ ఇండియాలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆయన 1947లో బర్మాలో జరిగిన అంతర్జాతీయ పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 1948లో జరిగిన ఆసియా శరీరసౌష్టవ పోటీల్లో గెలుపొంది మిస్టర్ ఆసియా బిరుదును సొంతం చేసుకున్నారు. 1948లో జరిగిన కామన్వెల్త్ పోటీల్లో పాల్గొన్న తొలి ఆంధ్రుడు దండమూడి.

1945 నుంచి 1958 వరకు 13 ఏళ్లపాటు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌గా గెలుపొందుతూ ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకాన్ని దశదిశలా ఇనుమడింపజేశారు. 1951 వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా క్రీడల్లో అతను కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు- ఇది ఈ రంగంలో బలమైన పోటీని మరియు పాల్గొన్న దేశాల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నట్టయితే భారత అథ్లెట్ చేసిన ఉత్తమ ప్రదర్శనలలో ఒకటి. 1952లో ఢిల్లీలో జరిగిన భారత ఒలింపిక్ స్పోర్ట్స్ ఈవెంట్‌లో హెవీవెయిట్ విభాగంలో 780 పౌండ్లను ఎత్తి బంగారు పతకం సాధించారు. ఆ తర్వాత 1954లో జరిగిన భారత ఒలింపిక్ స్పోర్ట్స్ ఈవెంట్లో అతను మళ్లీ బంగారు పతకం సాధించి మూడు రికార్డులు సృష్టించారు. రాజగోపాలరావు లండన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 16వ స్థానంలో, మెల్బోర్న్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 9వ స్థానంలోనూ ఫిన్‌లాండ్‌లో 6వ స్థానంలో నిలిచారు- ఇది ప్రపంచంలోని ప్రీమియర్








స్పోర్టింగ్ ఎగ్జిబిషన్‌లో ఆయన ఉత్తమ ప్రదర్శన.

రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషనకు అనేక సంవత్సరాలపాటు ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. వెయిట్ లిఫ్టింగ్‌లోనే కాక బలప్రదర్శనలో విశేష ప్రతిభ కనబర్చారు రాజగోపాలరావు. ఛాతికి గొలుసులు చుట్టి గాలిపీల్చడం ద్వారా ఛాతీని పెంచి వాటిని తెంపడం లాంటి సాహసకృత్యాలను దండమూడి అనేకం చేశారు.

దండమూడి రాజగోపాలరావు ఉయ్యూరు మండలంలో గండిగుంటలో 1916 అక్టోబర్ 14న జన్మించారు. ఉయ్యూరులో విద్యాభ్యాసం పూర్తిచేసి తర్వాత పెదపారుపూడి మండలం వానపాములలో తన సోదరి రంగమ్మ ఇంట ఉండి జాస్తి బాపయ్య, శిష్టా సోమయాజులు ప్రభృతుల ప్రోత్సాహంతో వెయిట్ లిఫ్టింగ్ సాధన ప్రారంభించారు

ఇదిలా ఉండగా వీరాభిమన్యు, నర్తనశాల, భీమాంజనేయ యుద్ధం తదితర చిత్రాల్లో భీముడి పాత్రలను పోషించిన దండమూడి ప్రజల మన్నన లను చూరగొన్నారు. వెండితెరపై గొప్పనటులైన ఎన్టీఆర్, ఎస్.వి. రంగారావు, కాంతారావు, శోభన్ బాబు సరసన నటించి మెప్పించారు.

రాష్ట్రవ్యాప్తంగా వ్యాయామశాలల ఏర్పాటుకు కృషిచేశారు. ఒలింపిక్ పోటీల అనంతరం విజయ వాడలో ఉచిత వ్యాయామశాల నెలకొల్పారు. ప్రభుత్వం విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో ఆయనకు ఇచ్చిన స్థలాన్ని మున్సిపల్ కార్పొరేషన్‌కు విరాళంగా ఇచ్చారు. దాంతో ఆయన పేరుతో కార్పొరేషన్ ఇండోర్ స్టేడియం నిర్మించింది.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఆయన ‘ఆంధ్ర భీమ’, ‘ఇండియన్ టార్జాన్’, ‘ఇండియన్ హెర్క్యులస్’, ‘జాయింట్ ఆఫ్ ఇండియన్’ బిరుదులను పొందారు. 1981 ఆగస్టు 6న విజయవాడ లబ్బీపేటలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. దండమూడి వారి సతీమణి అనసూయగారు. ఆయనకు ఐదుగురు సంతానం. వారిలో ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు.

దండమూడి రాజగోపాలరావు భారతదేశం కీర్తి పతాకాన్ని దశదిశలా ఇనుమడింప జేశారు. మన అందరికి స్ఫూర్తి ప్రదాత!

మళ్ళీ

# కొమ్మూరి జ్ఞాపకాలు

దండకారణ్యం మధ్యలో ఉన్న ఆ లంబసింగి అవతలుంది తాజంగి అనే ఆ చిన్ని గిరిజన గ్రామం.

1917 డిసెంబర్ 12 ఆ పొద్దుటపూట... ఆ తాజంగి గ్రామం మొదట్లో ఉన్న ఆ ఎత్తైన కొండ మీదున్న ఆ బంగళా ముందు మూడు గుర్రాలొచ్చి ఆగినియ్యి.

# నల్లటి రామచిలక



ఒక గుర్రం మీద యూరప్‌లో వున్న ఎటిమోర్గ్ యూనివర్సిటీ నించి పక్షుల మీద పరిశోధన చెయ్యడానికొచ్చిన ఎడ్విన్ ఉన్నాడు. మిగతా రెండు గుర్రాల మీద అతని సామాన్లు, అడివి మధ్యలో ప్రయాణం చేస్తున్నప్పుడు అవి కిందపడి పోకుండా చూసుకోడానికొచ్చిన ఇద్దరు గిరిజన కుర్రోళ్లున్నారు.

ఒక్క జంప్‌తో కిందికి దూకిన ఆ ఎడ్విన్ కాళ్లకున్న నల్లటి తోలు బూట్లు చిత్రమైన కిర్రు చప్పుళ్లు చేస్తా నేలమీద మొల్చిన పచ్చటి మొక్కల్ని పచ్చడి చేసేసినియ్యి.

నలభయ్యేళ్లుంటాయిగానీ ముప్పయ్యేళ్లోళ్లా చాలా హుషారుగా కనిపిస్తున్నా ఎడ్విన్, కొండ దిగువలో వున్న ఆకుపచ్చటి లోయల్ని, అందంగా అరుస్తున్న పక్షుల్నీ పరమానందంగా చూస్తున్నాడు. చల్లగా వీస్తున్న చలికి చిత్రంగా కదుల్తున్నాడు.

సామాన్లన్నీ బంగ్లా లోపల సర్దేసినా ఇద్దరు కుర్రోళ్లూ ఎడ్విన్ ముందుకొచ్చి నిలబడి, మరి శలవు అన్నట్టు సైగల్తో చెప్తుంటే వాళ్లకి రెండు బేడకాసులిచ్చి సాగనంపేడు.

*

పని గట్టుకుని తనని చూడ్డానికొచ్చినా లంబసింగిలో పెద్దమనిషి బస్వా మోదిరెడ్డి, తేజంగిలో జోడెపు పల్లదొరలాంటోళ్లు ఎడ్విన్ దొర అన్న తన పేరు నోరు తిరక్క, 'పిట్టలదొర... కొండమీద పిట్టలదొర,' అంటా పిలుస్తా కొండ దిగెళ్లిపోతున్నారు.

భుజానికి తగిలించుకున్న కెమెరాతో ఆ చెట్టు కొమ్మల మీద వాలున్న పక్షుల్ని చూస్తా చేతిలో వున్న కాకీసంచిలో గింజల్ని తీసి జల్లుతుంటే ఝూమ్మని వాలిపోయి ఆ ఎరల్ని ముక్కులో ఏరుకుంటున్న పక్షుల అందాల్ని చూసి మురిసిపోతా, అడుగులో అడుగేసుకుంటా వెళ్లి ఫోటోలు తీసుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఒకోసారి పట్టేసుకుని ముద్దుముద్దుగా వాళ్ల భాషలో మాటాడతా ముద్దెట్టుకున్నాకా ఫోటోలు తీసుకుంటున్నాడు. అవి ఆకాశంలో కెగిరిపోతుంటే, తనూ ఎగిరి గంతులేస్తా టాటా చెప్తున్నాడు.




తీసుకున్న ఫోటోల గురించి పుస్తకాల్లో రాసుకోడం, వంట చేసుకోడం, బట్టలుతుక్కోడం, అక్కడికొచ్చిన కొండోళ్లని 'హలో' అంటా పలకరించడం. ఎప్పుడు పడుకుంటన్నాడోగానీ, క్షణం తీరిక లేకుండా వుంటన్నాడా పిట్టల దొర.

*

ఎర్రటి ముక్కు, తెల్లటి జుట్టు, చిన్నసైజు కోడిపుంజు లాగుండే క్రెస్టడ్ ఇచీస్ అనే పక్షి తనకి తెల్సు.

చిక్కుడుచెట్టు మీద వాలిన ఆ పక్షి ఇచీస్‌లాగే వుందిగానీ తెల్లజుట్టు మధ్యలో నల్లమచ్చలకి బదులు పెద్ద పెద్ద వైలెట్ కలర్ మచ్చలున్నాయి. ఆత్రంగా దాన్నేచూస్తా దగ్గరకెళ్తుంటే చెట్టు గుబురుల్లోకి దూరి మాయమైపోయిందది.

తను కూడా గుబురుల్లోపలి కెళ్లే ప్రయత్నం చేస్తుంటే చిత్రమైన అరుపు. ఇచీస్ అరుపులా గాకుండా ఇదేదో కొత్తరకం అరుపులాగుంది.

బాగా దగ్గరకెళ్లాకా అరుపులాగిపోయినియ్యి. కొమ్మలమీదా గుబుర్లలోనూ వెతుకుతున్నాడు.

దారుణమైన నిశ్శబ్దం. కళ్లతోనే వెతుకుతున్న వాడల్లా ఒక్కసారి షాకైపోయేడు.

ఆ పక్షి రెండు కాళ్లు పట్టుకుని తలకిందులుగా వేలాడదీసుకుని పారిపోతుందో ఆడపిల్ల. గుండెలమీద ఏ ఆచ్ఛాదనా లేకుండా ఎర్రటి నేతచీర కట్టుకున్న ఆ నల్లటి ఆడపిల్ల జింకపిల్ల కంటే హుషారుగా పెద్ద పెద్ద అంగలేసుకుంటా ఆ పక్షి నెగరేసుకు వెళ్లిపోతుంటే వెనకాలే పరిగెట్టలేక బొక్కబోర్లాపడిపోయేడా పిట్టల దొర.

*

1918 జనవరి 24.

గజగజలాడించే చల్లటి చలికాలం.


చలిగాలి విపరీతంగా వీస్తున్న ఆ ఉదయం పూట సంత మొదలయిందా లంబసింగిలో .

దిగువ గ్రామాల్లో వుండే వ్యాపారస్థులు సామాన్లని గుర్రాల మీదా గాడిదల మీదా తెచ్చుకుని ఈ కొండ కొండల్లోపలి చిన్నిచిన్ని గ్రామాల్లో కొండోళ్లు, పండించుకున్నవి తెచ్చుకుని ఈ సంతలో వస్తుమార్పిడి చేసుకుంటున్నారు. ఉప్పు, నూనె, బట్టల దుకాణాల దగ్గర జనం ఎక్కువగా ఉన్నారు.

దిగువనించొచ్చినా పెద్దమనిషి పోలా జోగి నాయుడు, ఆ చిన్ని రాములోరి గుడి మెట్టుమీద కూర్చుని వారం కిందటి ఆంధ్రపత్రిక చదూతుంటే వినడానికొచ్చినా ఊరి జనం చిత్రంగా మూగుతున్నారు. ఈలోగా ఆగిన విల్లీస్ జీప్‌లోంచి దిగిన దొరలు పొగలొస్తున్న కార్క్ షోడా తాగుతుంటే చిత్రంగా చూస్తున్నారా అమాయకమైన గిరిజనులు.

పెట్టిలాంటి కెమెరా పట్టుకుని ఆ సంతలో నడుస్తున్న ఎడ్విన్‌కి రెండు కుందేళ్ల చెవులు పట్టుకునెళ్తా కనిపించినా నల్లపిల్ల మెరుపులా మెరిసి, మాయమైపోయింది.

ఎంత పెద్ద కళ్లు!!! అనుకుంటా సంతంతా వెతుకుతున్న ఎడ్విన్‌కి ఎక్కడా కనిపించడంలేదింక.




చీకటి పడింది. చలిగాలి పెరిగింది. దుకాణాల ముందు ఇలాయిబుడ్ల వత్తులు పెళపెళా కదుల్తా వెలుగుతున్నాయి. ఆముదం కాగడాలు పట్టుకు నడుస్తున్న కొండోళ్ల వెనకాల దర్జాగా నడుస్తా వెళ్తున్నారు దొరలు.

ఆ చీకట్లో ఎంత వెతికినా కనపడ్డం లేదా చీకటి రంగు పిల్ల.

*

టమోటాలు ఉడకబెట్టి సూప్ తయారుచేసుకుంటున్న ఎడ్విన్‌కి కిటికీ దగ్గర గాజుల చప్పుడు వినిపిస్తే చూసేడు.

పొగలొస్తున్న మట్టిదాక అక్కడ పెట్టి వెళ్లిపోయిందా నల్లచిలక.

చూస్తే ఉప్పు, మొరుగా దంచిన మిరియాల గుండా వేసి కాసిన మొక్కజొన్నల జావ.

గుక్కెడు తాగేడు.

రుచికి మతిపోయింది.

ఇంత రుచిగా వుంది, ఇంకా ఏమేం కలిపిందా కార్న్ సూప్‌లో అనుకుంటా దాన్ని చప్పరిస్తా బ్రెడ్ ముక్కలు కాల్చుకుంటన్నాడు.

ఉప్పు, మిరప్పళ్ల పొడుం కలిపేసి ఉడకబెట్టిన నెల్లి ఆకు దాక అక్కడ పెట్టేసెళ్లిపోయింది.

దాన్ని కూడా రుచి చూసిన ఎడ్విన్ కాల్చుకున్న బ్రెడ్ ముక్కలు కిటికీలోంచి బయట పారేసేడు.

పక్షుల్ని పట్టుకోడానికి ఎరవెయ్యడం, గింజలు జల్లడం లాంటివి చేస్తున్న ఆ పిట్టల దొరకి వలవేసి వాటిని పట్టుకోడం నేర్పిందా నల్లచిలక.

ఎంద్రితత, పిక్కుచ్చి, నీటికోడి, గంటల గమెదు, వంగపండు, ముంగపుతికి లాంటి అరుదైన పిట్టల్ని పట్టుకొచ్చి అతను పరిశోధన చేసుకోడానికి అద్భుతంగా సాయపడ్తుంది.

పోను పోను ఆ నల్లచిలక చేతిసాయం లేకుండా ఏదీ జరక్కుండాపోయే పరిస్థితొచ్చిందా ఎడ్విన్ దొరకి. దాంతో పక్షిపిల్ల నడిచి

వచ్చినంత నాజూకైన అను బంధం వాళ్ల మధ్యలోకి నడిచొచ్చింది.

పదహారో, పద్దెనిమిదో వయసున్న ఆ నల్లచిలకకి గొబిలం అనే వాళ్ల కొండకుర్రోడితో కుదిరిన సంబంధం తను ఈ పిట్టలదొరతో తిరుగుతున్న కారణంగా చెడిపోయింది.

ఆవేళ పొద్దుట తలుపు తెరిచేడు ఎడ్విన్. పొగ మంచుతో పాటు చిన్న గుడ్డలమూట చంకనెట్టుకుని లోపలికొచ్చింది నల్లచిలక. ఇదేంటన్నట్టు చూసేడు ఎడ్విన్. వాళ్లింట్లోనూ వాళ్ల గూడెంలోనూ తనని వెలేసినట్టు సైగల్తో చెప్పింది. నవ్వుతా గుండెల్లోపలికి రమ్మన్నాడా పిట్టలదొర.

మాటిమాటికీ అరుస్తా కరుస్తా అల్లరి చిల్లరిదాన్లా గుండే ఆ నల్లచిలక, నమ్మితే అంతే, నమ్మిస్తే అంతే.

ఆ పిట్టలదొర దగ్గరే వుండిపోడంతో అతని ఆర్నితాలజీకి సంబంధించిన రీసెర్చి పని చెకచెకా సాగిపోతుంది. చిలక చేసే వాళ్ల అడివి వంటలు వల్ల మాలిన రుచిలో ముంచేస్తున్నాయి దొరగార్ని.

పోను పోను పిట్టలదొరంటే చిలకకి ప్రాణం... చిలకంటే పిట్టలదొరకి ఆరోప్రాణం.

1918 మార్చి 20... పొద్దుటే నిద్రలేచిన ఎడ్విన్ దొరకి పక్కలో తనని అంటుకుపోయుండే నల్లచిలక కనిపించలేదు.

లేచి బంగ్లా మొత్తం తిరిగేడు, కొండంతా కలతిరిగేడు.


కనిపించలేదు నల్లచిలక.

వెతుక్కుంటా కొండ దిగి తేజంగి ఊరంతా వెతికి అక్కడ్నించి వెతుక్కుంటానే లంబసింగి వచ్చేటప్పటికి అప్పుడే నర్సీపట్నంనించి జీపేసుకొచ్చిన డేవిడ్సన్ దొర కనిపించేడు.

'చాలా అర్జంటు' అంటా ఆయన జీపు తీసుకుని వెతుక్కుంటా ఘాటీ దిగువలో వున్న డౌనూరు వెళ్లేడు.

కనిపించలేదు నల్లచిలక.

మళ్లీ పైకెక్కి లంబసింగికి ఈ దిగువలో వున్న లోతుగెడ్డ జంక్షన్‌లో వెతికేడు. కనిపించలేదు.



అప్పర్ సీలేరూ, లోయర్ సీలేరూ, చింతపల్లి మొత్తం వెతికేడు.

ఎక్కడా కనిపించలేదా నల్లచిలక... అంటా చెప్పడం ఆపేడు ముసిలోడయిన ఆ సుర్ల రామన్న. వింటున్న విజయ్‌బాబు సస్పెన్స్ తట్టుకోలేక, "కథ మాంచి కాకలో వుండగా ఆపేసేవేంటీ?" అన్నాడు.

"మీరు ఇష్టంగా వింటారని ఇలా బిగించి చెప్తున్నానుగానీ ఇది కథగాదు," అన్నాడు రామన్న,

"నిజంగా జరిగిందే, ఈ వూళ్లో చాలామంది చెప్పకోడం మాకు తెల్సుగానీ, మంచి పట్టులో వుండగా ఆపేసేవేంటీ అని?" అన్నాడు విజయ్‌బాబు.

"చెప్తాన్లే... చెప్పకుండా ఎక్కడికిపోతాను. నా కోసం కొన్న మందుసీసా ఇలాగివ్వండి ముందు," అంటా దాన్నందుకుని, మూత విప్పి ఇష్టంగా మందు చప్పరిస్తున్న ఆ ముసిలోడ్ని చెప్పమంటా ఎంత సతాయిస్తన్నా చెప్పటం లేదు. సీసాకాయి చూసుకుంటా చాలా యిష్టంగా ఆ అడివిసారా తాగుతా ఎటో చూస్తున్న అతని కళ్లల్లో నీటి తడి.

మిగతాది చెప్పకుండా ఆగిపోయినా ముసలతన్ని చూస్తున్న నాకు ఆవేళ పొద్దుట్నుంచీ జరిగిందంతా గుర్తుకొస్తుంది.

*

తుని రైల్వేస్టేషన్ ఎదురుగుండా వున్న ముబారక్ హోటల్లో బిర్యానీ తిన్నాకా, "మరి బయల్దేరదామా?" అంటా కారు స్టార్ట్ చేసేడు విజయ్‌బాబు.

ఎడంపక్క తాండవనది, కుడిపక్క మామిడి, జీడి మామిడీ కలగల్సిన తోటలు. మధ్యలో వున్న ఆ దారిలోంచెళ్లుంది మా కారు.

అద్దాలు దించేటప్పటికి శీతాకాలం మధ్యాన్నం ఎండా గాలి కలగలిసి లోపలి కొస్తుంటే భళే హాయిగా, ఆనందంగా వుంది. లంబసింగి దగ్గర కొండమీద పిట్టలదొర బంగ్లా, లవ్ స్టోరీ గుర్తుకొస్తుంది. అదే విషయం విజయ్‌బాబుకి చెపితే, "ఈ రాత్రికి లంబ సింగి వెళ్లినా అక్కడ మనం వుండటానికి ఆ మేష్టారి డాబా ఇల్లు తప్ప ఇంకేం లేవు," అన్నాడు.

"ఏం చేద్దాం మరి?" అన్నాను.

"కే.డి. పేటలో స్టే చేద్దాం."

"అక్కవడెవరున్నారు?"

"మా ఫ్రెండ్ మారంపల్లి బాబు. నిడదవోలు దగ్గరున్న మారంపల్లి నించొచ్చి ఇక్కడ పాతికెకరాల్లో కరివేపాకు పండిస్తున్న అతన్నంతా కరివేపాకు రాజు గారంటారు... మనం వస్తున్నట్టు ఆల్రెడీ ఆ కరివేపాకు రాజుగారికి చెప్పేసేను," అన్నాడు విజయ్.

ఆలోచించుకున్న నేను, "ఏదోలా ఎడ్జెస్టవుదాం గానీ లంబసింగే వెళ్లిపోదాం," అన్నాను.

"సరే," అంటా కారు ఘాట్ రోడ్ మొదట్లో తగిలే డౌనూరు వేపు తిప్పేడు. వర్షం మొదలైంది. కొండపిల్ల పైటచెంగులా వీస్తుంది గాలి. తెల్సుకోబోయే పిట్టల దొర ప్రేమకథలాగ చాలా హాయిగా వుంది వాతా వరణం.

ఆ మధురంలో తడుస్తా కొంతదూరమెళ్లామో లేదో చుక్కవరం లేదు. చల్లటి శీతాకాలం కొండ గాలులు. మళ్లీ కొండమీద పిట్టలదొర ప్రేమకథ గుర్తు కొస్తుంది. ఇన్నేళ్లయినా ఇంకా ఆ కొండమీదున్న పిట్టల దొర బంగ్లా దగ్గరకెళ్లాలి. ఆ ప్రేమ కథ వినాలి.

లంబసింగి వెళ్లేటప్పటికి బాగా చీకటి పడిపో యింది. చెక్‌పోస్ట్ దాటి పాడేరు వెళ్లే రూట్లోకి తిర క్కుండా రాములోరి గుడి దాటి తిన్నగా వూళ్లోకెళ్తున్నాం. మూసేసున్న ఆ కాఫీ హోటలు పాక ముందు కారు ఆపి దిగెళ్లిన విజయ్, "లోవరాజూ! లోవరాజూ! " అంటా పిలుస్తుంటే తడికి లాక్కుని బయటికొచ్చినా ఏభయ్యేళ్ల మనిషి, "బాగున్నారా?" అంటా పలక రించేడు.

ఆ లోవరాజుని పక్కకి పిల్చిన విజయ్‌బాబు వచ్చిన పని గురించి చెప్పేక కాసేపు మాటాడి, "మరి తొందరగా పంపించు," అంటా వచ్చి కారు స్టార్ట్ చేస్తుంటే, "ఎవరీ లోవరాజు?" అన్నాను.

"ఎదురేశ్వరంలో మన చప్పిడి రవి లేడూ.... అతని బంధువు. ఎప్పుడో ఈ ఊరొచ్చేసి ఇక్కడి గిరిజన అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఈ హోటలు పెట్టుకున్నాడు," అన్నాడు.

"చూస్తుంటే ఈ ఏరియాలో ప్రేమకథలు ఎక్కువ లాగున్నాయే."

"ఏమోగానీ, ఆ లోవరాజుకి మనమొచ్చిన పని చెప్పేను."

"ఏవన్నాడు?"

"మీరు చెప్పింది అక్షరాలా నిజమంట... ఆ పిట్టలదొర లవ్‌స్టోరీ తెల్సిన ముసిలోడొకడ్ని పంపిస్తాను. మీరెళ్లి టీచర్‌గారి డాబా యింట్లో వుండండి. అయితే, ఒక హాఫ్ బాటిలు మందు కొనుక్కు పట్టుకెళ్లండిగానీ ముందే ఇవ్వకండాడికి," అన్నాడు.

*

మందు మొత్తం పట్టించేసిన రామన్న మాట ఏమాత్రం తడబడ్డంలేదు సరిగదా గొంతు బాగా బల మైంది. కళ్లు బేటరీ లైట్లలాగ వెలిగి పోతున్నాయి. కుర్రాళ్లాగ వూగిపోతా మాదగ్గర కొచ్చి...

"ఆ డేవిడ్సన్ దొరగారి జీపు నడుపుకుంటా పాడేరూ, మత్స్యగుండం, మినములూరూ వెతు క్కుంటా కల తిరుగుతున్న పిట్టలదొరకి మోద కొండమ్మ పాదాలు (ఘాటీలో ఉన్న అమ్మవారి గుడి) దగ్గర ఒరియా పూజారితో పూజ చేయించుకుంటున్న నల్లచిలక కనిపించింది.

అంతే... జీపులోంచి దూకెళ్లి పోయినా ఎడ్విన్‌దొర ఆ చిలక గూబ మీద లాగిపెట్టి కొట్టేసేడు. మరి చిలక ఊరుకుందేంటీ... ఎగిరి మరీ కలబడింది. ఇద్దరూ ఇరగొట్టేసుకుంటుంటే విడదియ్యడానికెళ్లిన జనాలకి బలం చాలడం లేదు. కొట్టుకుని కొట్టుకుని

అలిసిపోయి పడిపోయేరు నేలమీద. చిట్టచివరికి తేలిందేంటంటే....

మొన్నామధ్య పిట్టలదొరకి విషపు జ్వరమొచ్చి ఇక బతుకుతాడనే నమ్మకం మొత్తం పోయింది.

పరాయిదేశం నించొచ్చిన ఈ మనిషిని బతికించి బట్ట కట్టించు తల్లీ! నీ గుళ్లోకొచ్చి పూజ్జేసుకుని, కోడి కోసుకుంటాను అనేసి ఆ మోదకొండమ్మోరికి మొక్కుకున్న మూడు రోజులకి లేచి కూర్చున్నాడంట ఈ పిట్టలదొర. ఇలా అడువుల్లోంచి ఇంతేసి దూరమెళ్తానంటే ఒప్పుకోడని చెప్పాపెట్టకుండా ఒచ్చేసిందంట చిలక.

అంత ఇదయిన వాళ్లిద్దరి ప్రేమ గురించి తెల్సిపోయిన గూడెం జనాలు తెగ ఇదయిపోతా ఇద్దర్నీ వాళ్లలో కలిపేసుకుందారనెళ్తే, "ఎల్లండెహె... ఎదవ మొకాలేసుకుని," అంటా రాళ్లిసిరి తరిమేసిందా చిలక.

*

1918 నవంబర్ 20 పొద్దుటపూట... ఆదరా బాదరా బట్టలు సర్దేసుకుంటున్నాడు పిట్టలదొర. అది చూసిన నల్ల చిలక దగ్గరకెళ్లి ఏంటన్నట్టు చూసింది.

అర్జంటు పనిబడ్డంతో ఓడెక్కి వాళ్ల దేశమెళ్తున్నాడంట. తిరిగి రాడానికి కొన్ని నెలలు పడద్దంట. సైగలో చెప్పేడు.

ఏనాడూ ఎప్పుడూ లేంది గొల్లుమన్న నల్లచిలక, లబోదిబోమంటా శోకాణాలు పెడుతుంది. పిట్టలదొర కూడా చాలా గట్టిగా అరుస్తా ఏదేదో ఇంగ్లీషులో చెపుతా, మధ్యమధ్యలో ఏడ్చేస్తున్నాడు.

చివరికి ఒకళ్లనొకళ్లు కౌగలించుకుని ఒకళ్ల మీదొకళ్లు పడి ఏడుస్తున్నారు.

*

పిట్టలదొర వెళ్లిపోయేకా ఒంటరిపిట్టలాగా ఆ బంగళా లోపలా బయటా కల తిరుగుతా పిట్ట అరుపు వినపడితే చాలు తన దొరొచ్చేడంటా బయటికొచ్చేస్తుంది. కొండ చుట్టూరా కలతిరుగుతుంది.

పిట్టలదొర చేసే సందడీ, వాటిని ఫోటోలు తీసేటప్పుడేసే పిల్లిమొగ్గలూ, కాయితాల మీద రాసుకునేటప్పుడూ, రాత్రయ్యేకా తన ఒంటిమీద రాసుకునేటప్పుడూ ఆ దొర చేసే అల్లరీ అన్నీ తల్చుకుంటా కొండ మీదకి పిట్టలు తెచ్చి అవి వదిలేసినవి తింటా ప్రాణంలాగ ప్రేమిస్తా పనిమీదెళ్లినోడు నన్ను మోసం చెయ్యడు. అక్కడెలాంటి పనుల్లో ఇరుక్కుపోయున్నాడో పాపం. వస్తాడు ఎట్టి పరిస్థితుల్లోనూ వస్తాడు అనుకుంటా బతుకుతుంది. ఎవరన్నా పరాయోళ్లు అక్కడికొస్తుంటే రాళ్లతో కొట్టి తరిమేస్తా తన దొర కోసం బతుకుతుంది.

నెలయ్యింది, పదినెల్లయ్యింది, ఏడాదయ్యింది, పదేళ్లయ్యింది. కడాఖరికి పాతికేళ్లయ్యింది.

*


వారంరోజుల్నుంచి తుఫాను. ఊపిరాడనియ్యటం లేదు.

భయంకరమైన ఆ చీకటి రాత్రి జ్వరం నల్లపిల్లకి. పొయ్యి మీద పేనంలాగ కాలిపోతుంది ఒళ్లు. పెదాలెండి పోతున్నాయి. చలికింక తట్టుకోలేకపోతుంది...

గాలికి రెపరెపలాడి కొండెక్కిన దీపంలాగ గిలగిలా కొట్టుకున్న ఆ నల్లచిలక ప్రాణం అమాంతంగా పోయిందా అర్ధరాత్రి... అంటా ఆపేడు రామన్న.

మాటలు రాని మేం అలాగుండిపోయేం చాలాసేపు.

మళ్లీ నోరు విప్పిన రామన్న, "దెయ్యమైన



నల్లచిలక తన దొర కోసం ఎదురుచూస్తానే ఉంది... ఇది జరిగి వందేళ్లయినా. నల్లచిలక దెయ్యం అక్కడే ఆ బంగళా చుట్టూరా తిరుగుతానే వుంది, పరా యోళ్లొస్తే బెదిరించి తరిమేస్తంది.''

*

తెల్లారింది.

గజిబిజిగా వున్న రాళ్లు రప్పలూ తుప్పలూ దాటు కుంటా ఆకొండ పైకెక్కడానికి నానా అవస్తాపడ్తున్నాం. ఒకప్పుడెప్పుడో జీపు వెళ్లడానికుండే దారి చెట్లతో మొక్కలతో మూసుకుపోయి కనపడ్డం లేదిప్పుడు.

మొత్తానికి గంట తర్వాత ఆ పిట్టలదొర బంగళా దగ్గరకి చేరేం.

అక్కడ బంగళా లేదు.

కొన్ని ఆనవాళ్లతో చాలావరకూ కూలిపోయిన గోడలున్నాయి. వాటి మధ్యలో వృక్షాలైపోయి వూడ లేసిన చెట్లున్నాయి.

ఆ శీతాకాలం చలిలో పరమ నిశ్శబ్దంగా వున్న ఆ వాతావరణం లోపల కలతిరుగుతుంటే ఆ నిశ్శబ్దంలో ఏదో వింత హోరు.

పగలే చీకటిగా వున్న ఈ పిట్టలదొర బంగళా వాతావరణంలో దెయ్యమై ఇప్పటికీ ఎదురు చూస్తుందా ఆ నల్లచిలక?

ఇంకాసేప్పుంటే కాళ్ల మురుగుల చప్పుడూ చేతి గాజుల చప్పుడూ మాకు వినిపిస్తుందేమో చూడాలి...

చప్పుడు రాని ఆ ప్రేమభాషని వినాలి అను కుంటా ఆ వాతావరణంలో కల తిరుగుతున్న మేం ఈ ప్రపంచంలో ఆడదాని ప్రేమకున్న శక్తి దేనికీ లేదేమో అనుకుంటా...

ఏదో అలికిడయినట్టనిపించడంతో ఆ పక్కకి తొంగిచూసేం...




YOUR DAY ... YOUR VISION

Razberry's
Making Moments Memorable

Weddings • Sweet 16
Social Events • Corporate Events

\Razberrys.Banquet.center

834 State Rt 12
Flemington, NJ, 08825
908-782-2379 • 908-399-9459
www.razberrys.net





AROUND THE WORLD

# SHIPPING

**3-5 Days Door to Door Delivery**

Medicines | Food Items | Clothes | Gift Items | And Many More

CALL US NOW AT

**+1 (470) 384-9581**

HANUMA VEGA

INTERNATIONAL COURIER AND LOGISTICS



శ్రీ అట్లూరి & జలపతి


# గ్యాప్ రాలేదు... గ్యాప్ వస్తోంది!

ఊరికి మొనగాడు, ప్రేమకానుక, కొండవీటి సింహం, గజదొంగ, తిరుగులేని మనిషి, సత్యం శివం... 1981లో దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు తీసిన సినిమాలివి.

బొబ్బిలిపులి, గోల్కొండ అబ్బులు, జయసుధ, కృష్ణార్జునులు, రాగదీపం, యువరాజు... 1982లో దర్శకరత్న దాసరి నారాయణరావు అందించిన సినిమాలు ఇవి.

ఏడాదికి అరడజనుకి తగ్గకుండా సినిమాలు రిలీజ్ చేసేవారు. ఇద్దరూ అప్పట్లో అగ్రదర్శకులు. రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావులతోపాటు 80లలో టాప్ డైరెక్టర్లుగా చలామణి అయిన కోడి రామకృష్ణ, కోదండరామిరెడ్డి వారంతా స్పీడ్‌గానే సినిమాలు తీసేవారు. ఒకేసారి రెండు సినిమాలను సెట్స్ పై నిలిపిన సందర్భాలు అనేకం. అప్పట్లో షిఫ్ట్‌ల వారీగా షూటింగ్స్ చేసేవారట.









తర్వాతర్వాత క్వాన్టిటి కన్నా క్వాలిటీ ప్రాధాన్యం అనే భావన రాంగోపాల్‌వర్మ శకంతో మొదలైంది. ఒక టైంలో ఒక సినిమానే డైరెక్ట్ చెయ్యడం మొదలు పెట్టారు. ఐతే, ఏడాదికి కనీసంగా రెండు సినిమాలు తీసేవారు. 2000 తర్వాత... మళ్లీ మార్పు. రాజమౌళి, గుణశేఖర్ వంటి దర్శకులు బిగ్ కాన్వాస్, భారీ సెట్స్ వంటి ట్రెండ్ సెట్ చేశారు. అంతే... ఒక్కో మూవీ మేకింగ్ టైం ఏడాది పట్టడం మొదలయింది. సినిమాల బడ్జెట్స్ మారిపోయాయి. మార్కెట్ పెరిగింది. ఇప్పుడు పాన్ ఇండియా మోజు వచ్చింది.

## మినిమమ్ మూడేళ్లు

పాన్ ఇండియా క్రేజ్ రాకముందు నుంచే... దర్శకులు 'చెక్కడం' షురూ చేశారు. దాంతో అనివార్యంగా సినిమా పూర్తి చేసేందుకు పట్టే టైం కూడా ఏడాది నుంచి రెండు, మూడేళ్లకి పెరిగింది. ఇదంతా తెలిసిన విషయమే. ఐతే, పెద్ద దర్శకులకు ఇప్పుడో కొత్త, విచిత్రమైన గ్యాప్ వస్తోంది. వారు తీసే సినిమాల మధ్య గ్యాప్ మూడేళ్ల వరకు వెళ్తోంది. రాజమౌళి తీసిన *ఈగ* 2012లో వచ్చింది. బాహుబలి మొదటి భాగం 2015లో, రెండో భాగం 2017లో రిలీజ్ అయ్యాయి. ఇప్పుడు తీస్తున్న *ఆర్.ఆర్.ఆర్.* 2021లో వస్తుందో, 2022లో రిలీజ్ అవుతుందో ఇప్పుడే చెప్పలేం. ఏ లెక్కన చూసినా, మినిమమ్ మూడేళ్లు పడుతుంది రాజమౌళి సినిమాకి.

రాజమౌళి తర్వాత మోస్ట్ సక్సెస్‌ఫుల్ రైటర్, డైరెక్టర్... కొరటాల శివ. 100 పర్సెంట్ సక్సెస్ రేట్ ఉంది ఆయనకి. అయినా, హీరో కోసం నిరీక్షణ తప్పలేదు, గ్యాప్ రాక మానలేదు. *భరత్ అనే నేను* సినిమా రెండేళ్ల క్రితం విడుదలయింది. ఇప్పుడు కొరటాల మెగాస్టార్ చిరంజీవితో తీసున్న ఆచార్య 2021లో రిలీజ్ అవుతుంది. అంటే... కొరటాలకి ఇంకో సినిమా విడుదల చేసేందుకు పడుతున్న టైం త్రీ ఇయర్స్. అంత పెద్ద దర్శకుడు అయినా కూడా హీరో కోసం నిరీక్షించక తప్పలేదు.

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ రేంజ్ ఏంటో చెప్పక్కర్లేదు. *అల వైకుంఠపురంలో*... సక్సెస్‌తో అలా అమాంతం పైకి వెళ్లింది ఆయన గ్రాఫ్. హిట్లు, ఫట్లు అని కాకుండా... ఎప్పుడూ అగ్రదర్శకుడిగానే కొనసాగుతున్న డైరక్టర్ ఆయన. ఐతే, త్రివిక్రమ్‌కి కూడా మూడేళ్ల గ్యాప్ వచ్చేలా ఉంది. ఈ ఏడాది సంక్రాంతికి విడుదలయింది *అల వైకుంఠపురంలో*... ఎన్టీఆర్‌తో ఆయన నెక్స్ట్ మూవీ. అది నెక్స్ట్ ఇయర్ ఎప్పుడో పట్టాలెక్కుతోంది. 2022లో విడుదలవుతుంది. అంటే ఎగ్జాట్లీ త్రి ఇయర్స్ గ్యాప్.

అదే పంథాలో ఇప్పుడు సుకుమార్ వెళ్తున్నాడు. *రంగస్థలం* అతని కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్. మన తెలుగు సినిమా ఆల్‌టైం హిట్స్‌లో అదొకటి. కానీ ఇప్పటివరకు నెక్స్ట్ మూవీ సెట్స్ మీదకు తీసుకెళ్లలేదు. ముందు మహేష్‌బాబుతో ప్లాన్ చేసి, అది సెట్ అవ్వక, ఆ తర్వాత బన్నీ కోసం వెయిట్ చేసి, ఇప్పుడు కరోనా



దెబ్బకి గ్యాప్ తీసుకోవాల్సి వచ్చింది. *రంగస్థలం* 2018లో విడుదల అయింది. సుకుమార్ తన నెక్స్ట్ మూవీ పుష్పని సెట్స్ మీదకు తేవడానికి రెండేళ్లు పట్టింది. ఇది షూటింగ్ పూర్తిచేసుకొని విడుదల కావాలంటే మరో ఏడాది పడుతుంది. అంటే... త్రీ ఇయర్స్ గ్యాప్ బిట్వీన్ టు ఫిలిమ్స్.

మరో అగ్ర దర్శకుడి జాబితాలో ఉన్న వంశీ పైడిపల్లిది మరోరకమైన స్టోరీ. ఇతనికి స్టోరీలు దొరకవు. ఆ కథలు వండడానికి ఏడాది, రెండేళ్లు తీసుకుంటాడు. అందుకే... ఇతను కూడా గ్యాప్ తీసుకుంటాడు ఎక్కువగా. మహర్షి లాస్ట్ ఇయర్ సమ్మర్‌లో వచ్చింది. ఇప్పటివరకు తదుపరి చిత్రం ఎవరితో అన్నది తేలలేదు. హరీష్‌శంకర్... తన నెక్స్ట్ మూవీ పవన్‌కళ్యాణ్ హీరోగా అంటూ ప్రకటించాడు. కానీ ఇది విడుదలయ్యేసరికి ఇంకో ఏడాదిన్నర పట్టేలా ఉంది. అంటే అతను కూడా త్రీ ఇయర్స్ గ్యాప్ దర్శకుల జాబితాలో చేరినట్లే.

## స్టార్ల మీద మోజు... అగ్రదర్శకుల వీక్‌నెస్


దాసరి, రామ్‌గోపాల్‌వర్మ, రాఘవేంద్రరావులకు సాధ్యమైనది నేటి అగ్ర దర్శకులకు ఎందుకు కుదరడం లేదు? ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది, ఇండస్ట్రీలో ప్రొఫెషనలిజం వచ్చింది. అయినా కూడా స్పీడ్‌గా ఎందుకు సినిమాలు తీయలేకపోతున్నారు. సినిమా సినిమాకి మూడేళ్ల గ్యాప్ ఎందుకొస్తోంది? దీనికి సమాధానం... సింపుల్. మొదట్లో ఇచ్చిన ఒక లిస్ట్ చూస్తేచాలు... దాసరి, రాఘవేంద్రరావులు అటు... ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణవంటి పెద్ద హీరోలతో సినిమాలు చేశారు. మురళీమోహన్, మోహన్‌బాబు వంటి చిన్న హీరోలతో కూడా సినిమాలు తీశారు. అలాగే, కొత్తవారితో కూడా ప్రయోగాలు చేశారు. పెద్ద హీరోల డేట్స్‌కోసం వెయిట్‌చేస్తూ టైంవేస్ట్ చేసుకోలేదు.

ఇప్పటి అగ్ర దర్శకులది పూర్తిగా భిన్నమైన వైఖరి. ఒక్కరికి కూడా కొత్తవాళ్లతో సినిమాలు తీసే ధైర్యం లేదు. పేరుకి వీళ్లు స్టార్ డైరెక్టర్లు. కానీ వీళ్లు స్టార్స్ లేకుండా సినిమాలు చెయ్యరు. తమ సొంత ఇమేజ్‌తో ఒక కొత్త హీరోని పరిచయం చేసి హిట్ చేద్దామనే ఆలోచన రాదు. ఆ ప్రపోజల్‌ని తెచ్చినవాళ్లని బండ బూతులు తిడుతారు. రాజమౌళి, త్రివిక్రమ్, కొరటాల శివ, సుకుమార్... ఇలా ఏ అగ్ర దర్శకుడికైనా... చిరంజీవి, ప్రభాస్, పవన్‌కళ్యాణ్, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ లాంటి టాప్ హీరోలే కావాలి. అందుకే... హీరోలు కూడా వీళ్లని వెయిటింగ్‌లో ఉంచుతారు.

హీరోలతో కాకుండా సినిమాలు తీయలేక పోవడమే ఈ పెద్ద దర్శకులకి గ్యాప్ రావడానికి కారణం.

# WE ARE LOOKING for FRANCHISEE PARTNERS

CURIE LEARNING
*learning with the leader ...*



Curie Learning is a leading provider of customized after school learning programs for students Pre-K through high school.

**Our Programs:**

- K to Grade 7 Advanced Math & English program
- Specialized coaching for Magnet / Gifted and Talented School Entrance
- SAT / PSAT / ACT Specialized Coaching
- Creative English Writing
- Competitive Math Coaching
- S T E M Programs and other Academic Camps

## OTHER LOCATIONS

| | |
|---|---|
| Gainesville - VA | gainesville.va@curielearning.com |
| Ellicott City - MD | ellicottcity.md@curielearning.com |
| German Town - MD | germantown.md@curielearning.com |
| Edison - NJ | edison.nj@curielearning.com |
| Exton - PA | exton.pa@curielearning.com |
| Cumming - GA | curie.atlanta@gmail.com |
| Frisco - TX | frisco.tx@curielearning.com |
| Troy - MI | troy.mi@curielearning.com |
| Plymouth - MN | plymouth.mn@curielearning.com |
| Richmond - VA | richmond.va@curielearning.com |
| Apex - NC | apexcurie@gmail.com |
| Sunnyvale - CA | sunnyvale.ca@curielearning.com |

To know more about franchisee opportunity write to :

**rao@curielearing.com**

or call on

**703 582 0436 or 703 762 6120**

**Corporate Centers**

HERNDON.VA : herndon.va@curielearning.com
SOUTHRIDING.VA : southriding.va@curielearning.com
ASHBURN.VA : ashburn.va@curielearning.com

www.curielearning.com

**One stop solution for your child's academic needs...**

సినీ సమీక్ష

శ్రీ అట్లూరి

# నిశ్శబ్దం

*తారాగణం:* అనుష్క, మాధవన్, అంజలి, సుబ్బరాజు, షాలిని పాండే తదితరులు
*సంగీతం:* గోపీసుందర్
*క్రియేటివ్ ప్రొడ్యూసర్:* కోనా వెంకట్
*నిర్మాత:* టీజీ విశ్వప్రసాద్
*రచన, దర్శకత్వం:* హేమంత్ మధుకర్
విడుదల తేదీ: 1 అక్టోబర్ 2020
వేదిక: అమెజాన్ ప్రైమ్ వీడియోస్




ఎన్నో తర్జనభర్జనల మధ్య, ఇంకెంతో చర్చల మధ్య, మరెన్నో ఊహాగానాల మధ్య ఎట్టకేలకు ఓటీటీలో విడుదలైంది నిశ్శబ్దం సినిమా. పూర్తిగా అనుష్క క్రేజ్, పాపులారిటీపై ఆధారపడి విడుదలైన ఈ సినిమాను బొమ్మాళి నిలబెట్టిందా? ఈ ప్రశ్నకు ఔననే సమాధానం చెప్పాలి. తన నటనతో ఈ సినిమాను నిలబెట్టింది అనుష్క. ఆమె నటన కోసం ఈ సినిమాను చూడాల్సిందే. అంతకుమించి ఇందులో కథ-కథనం పెద్దగా ఆకట్టుకోవు. పైపెచ్చు 'ఓస్ ఇంతేనా' అనే నిట్టూర్పు విడిచేలా చేస్తాయి.

మూగ-చెవిటి అమ్మాయి సాక్షిగా అనుష్క ఇందులో కనిపిస్తుంది. ఆమె పెయింటింగ్స్ చూసి ఇష్టపడి ఎంగేజ్‌మెంట్ వరకు వెళ్తాడు ఆంటోనీ (మాధవన్). అదే టైమ్‌లో క్లోజ్ ఫ్రెండ్ సోనాలి (షాలినీ పాండే) మరణంతో డిస్టర్బ్ అయిన సాక్షిని, అలా బయటకు తీసుకెళ్తాడు ఆంటోనీ. ఈ క్రమంలో ఇద్దరూ ఓ పాడుపడ్డ విల్లాలోకి ఎంటరౌతారు. అలా ప్రవేశించిన కొద్దిసేపటికే ఆంటోనీ హత్యకు గురవుతాడు. అసలు ఆ విల్లాలో ఏం జరిగింది? ఆంటోనీని ఎవరు చంపారు? ఈ కేసును డీల్ చేసిన క్రైమ్ డిటెక్టివ్ మహా (అంజలి) చివరికి తెలుసుకున్న నిజం ఏంటి? ఇది నిశ్శబ్దం సినిమా కథ.

చెప్పుకోవడానికి సింపుల్‌గా, రొటీన్ మర్డర్ మిస్టరీ అనిపించే ఈ కథకు మంచి నటీనటుల్ని, అంతకు మించి మంచి నేపథ్యాన్ని ఎంచుకుంది సినిమా యూనిట్. అనుష్కతోపాటు మాధవన్, అంజలి, అవసరాల, షాలినీపాండే, సుబ్బరాజు లాంటి నటుల్ని రంగంలోకి దించింది. అంతేకాదు.. కథకు రిచ్ లుక్ ఇచ్చేందుకు అమెరికా బ్యాక్ డ్రాప్ కూడా ఫిక్స్ చేసుకుంది. టెక్నీషియన్స్ విషయంలో కూడా ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. ఇన్ని చేసిన యూనిట్... ఒకే ఒక్క తప్పు చేసింది. అదే రైటింగ్ టేబుల్ మీద దృష్టి పెట్టకపోవడం.

ఈ సినిమా స్టార్టింగ్ నుంచి ముందుకు నడిచే కొద్దీ ఎవరు విలన్, నెక్ట్స్ ఏం జరగబోతోందనేది ఈజీగా అర్థమైపోతుంది. ప్రేక్షకుడు ఇలా ముందుగానే జరగబోయేది గెస్ చేశాడంటే ఓ మిస్టరీ-థ్రిల్లర్ సినిమాను అదే పెద్ద మైనస్ పాయింట్ అవుతుంది. నిశ్శబ్దం సినిమాకు కూడా అదే మైనస్. సినిమా రాసుకున్న విధానంలో, తర్వాత తీసిన విధానంలో చేసిన తప్పులు 'నిశ్శబ్దం' ఫలితాన్ని మార్చేశాయి.

ఉన్నంతలో ఈ సినిమాలో చెప్పుకోవడానికి ఏదైనా ఉందంటే అది ఛాయాగ్రహణం మాత్రమే. టెక్నికల్‌గా ఇదొక్కటే బాగుంది. గిరీష్ గోపాలకృష్ణ

ఇచ్చిన నేపథ్యసంగీతం కూడా ఎక్కడో విన్నట్టే అని పిస్తుంది తప్ప కొత్తదనం లేదు. ఇక గోపీసుందర్ సంగీతం ఈ సినిమాకు ఏమాత్రం కలిసిరాలేదు. అసలు పాటలే పెట్టకూడని కథలో, ఇరికించిన పాటలు కూడా వినసొంపుగా అనిపించవు. రచన-దర్శ కత్వం విభాగాల్ని హేమంత్ మధుకర్ చూసుకున్నాడని గట్టిగా చెప్పలేం. ఎందుకంటే అక్కడ క్రియేటివ్ ప్రొడ్యూసర్ పేరుతో కోన వెంకట్ ఉండనే ఉన్నాడు. అన్ని విభాగాల్లో తన ప్రమేయం ఉందని కోన స్వయంగా చెప్పుకున్నాడు కాబట్టి.. కథనంలో తప్పులు, కథలో బిగి లేకపోవడం లాంటి విషయాల్లో దర్శకుడితో పాటు ఈ క్రియేటివ్ ప్రొడ్యూసర్ ను కూడా నిందించాల్సి ఉంటుంది.

నటన పరంగా చూసుకుంటే ఇంతకుముందే చెప్పుకున్నట్టు అనుష్క ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణ. ఓటీటీలో ఈ సినిమాకు అంతోఇంతో హిట్స్ వస్తే అది అనుష్క చలవే అనుకోవాలి. మాధవన్ ఉన్నంతలో మెప్పించినప్పటికీ... ఆ పాత్రకు మాధవన్‌ను తీసు కోవడం వల్ల కథలో మలుపులు ముందే ఊహించడం ప్రేక్షకుడికి సులువు అయిపోయింది. ఇక షాలినీ పాండే, సుబ్బరాజు తమ పాత్రలకు న్యాయం చేయగా... అంజలి గురించి ప్రత్యేకంగా మాట్లాడు



కోవాలి. అమెరికాలో డిటెక్టివ్ ఏజెంట్‌గా ఉండే అంజలి చాలాచోట్ల సిల్లీగా కనిపిస్తుంది. కనీసం ఆమెకు ఇంగ్లిష్ డైలాగులు ఇవ్వకుండా ఉండాల్సింది. ఆమె ఇంగ్లిష్ డైలాగ్స్‌కు నవ్వొస్తే అది మీ తప్పుకాదు.

ఓవరాల్‌గా ఈ సినిమా క్లైమాక్స్ చూసిన తర్వాత అనుష్క నటించిన 'భాగమతి' మూవీ మరోసారి గుర్తొస్తుంది తప్ప కొత్తగా ఏం అనిపించదు. నెమ్మదిగా సాగే కథనం, రొటీన్ కథ, ఊహించే మలుపులులతో.. 'నిశ్శబ్దం' సినిమా రొటీన్ క్రైమ్ థ్రిల్లర్ అనిపించు కుంటుంది.

*బాటమ్ లైన్ - సౌండ్ చేయని నిశ్శబ్దం*

*రేటింగ్ - 2/5*

---




*తారాగణం:* రాజ్‌తరుణ్, మాళవిక నాయర్, హెబా పటేల్, వాణీ విశ్వనాథ్, నరేష్, పోసాని తదితరులు

*సంగీతం:* అనూప్ రూబెన్స్ *నిర్మాత:* కె.కె. రాధామోహన్

*కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం:* కొండా విజయ్‌కుమార్

**విడుదల తేదీ:** 1 అక్టోబర్ 2020

**వేదిక:** ఆహా యాప్

ఏదైనా అతి అయితే వెగటు పుడుతుందంటారు. ఒరేయ్ బుజ్జిగా విషయంలో కూడా అదే జరిగింది. ఈ సినిమాలో కామెడీ పేరిట జరిగిన తతంగం మరీ ఎక్కువైంది. ఇక ముగించేస్తారని ప్రేక్షకుడు అనుకున్న టైమ్‌లో కూడా మరో 20 నిమిషాలు సాగదీయడం ఈ సినిమాకు మైనస్ అయింది.



ఓ చిన్న ప్రేమకథకు పెద్ద కామెడీ టచప్ ఇద్దామని ఈసారి దర్శకుడు విజయ్‌కుమార్ కొండా భావించినట్టున్నాడు. అతడి కసరత్తు మొత్తం (కథ-స్క్రీన్ ప్లే) ఆ కోణంలోనే సాగింది. అందులో కొంత ఫోకస్ అయినా సెకండాఫ్ పై పెట్టి ఉంటే రిజల్ట్ కాస్త బెటర్‌గా ఉండేది. ఈ భావన సెకెండాఫ్ ప్రారంభమైన కొద్దిసేపటికి కలుగుతుంది. హీరో గతం ఏంటనేది హీరోయిన్‌కు, హీరోయిన్ గతం ఏంటనేది హీరోకు తెలియనంతవరకు ఈ వ్యవహారం బాగానే నడిచింది. ఎప్పుడైతే సీన్ హైదరాబాద్ నుంచి నిడదవోలుకు మారిందో అప్పుడిక క్లైమాక్స్‌లోకి ఎంటరైపోతే బాగుండేది. కానీ నిడివి కోసం పడ్డ తిప్పలు మన సహనానికి ఒక పరీక్ష. సెకండాఫ్‌లో హాస్పిటల్ సీన్ రాగానే, 'ఇక చాలురా బుజ్జిగా,' అని రావాలనిపిస్తుంది.

కథ విషయానికొస్తే... బుజ్జి (రాజ్‌తరుణ్), కృష్ణవేణి (మాళవిక నాయర్)ది ఒకటే ఊరు. కానీ ఒకరికి ఒకరు తెలియదు. ఇంజనీరింగ్ పూర్తిచేసిన బుజ్జికి పెళ్లి చేయాలని చూస్తాడు తండ్రి (పోసాని). అదే టైమ్‌లో కృష్ణవేణికి కూడా పెళ్లి చేయాలనుకుంటుంది ఆమె అమ్మ (వాణి విశ్వనాథ్). అప్పటికే సుజన (హెబ్బ పటేల్)తో ప్రేమలో పడిన బుజ్జి, అమ్మ చూసిన సంబంధం ఇష్టంలేక కృష్ణవేణి ఇంటి నుంచి పారిపోతారు. వీళ్లిద్దరూ ఒకరి తర్వాత మరొకరు ఒకే ట్రైన్ ఎక్కడం చూసిన ఆ ఊరి వ్యక్తి ఇద్దరూ కలిసి లేచిపోయారని పుకారు పుట్టిస్తాడు. దీంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు అవుతుంటాయి. అదే టైమ్‌లో హైదరాబాద్‌లో అనుకోకుండా కలిసిన బుజ్జి-కృష్ణవేణి ఒకరికొకరు దగ్గరవుతారు. ఈ లైన్‌లో సాగిన సినిమా... క్లైమాక్స్‌కొచ్చేసరికి ఎలా ముగిసిందనేది కథ.

నిజానికి కథను ఇదే లైన్‌లో చెప్పుకుంటూ పోతే ముగింపు ఇవ్వడం చాలా సులభం. కానీ దర్శకుడు మాత్రం మరింత కామెడీ దట్టించాలనే కసితో సినిమాను మలుపుల మీద మలుపులు తిప్పాడు. దీంతో ఒక దశకు చేరేసరికి బుజ్జిగాడి బండి కదలనని మొరాయిస్తుంది. అప్పుడిక తప్పదన్నట్టు శుభం కార్డు వేస్తాడు దర్శకుడు. ఈ క్రమంలో హీరోయిన్ లేచి పోవడం, మళ్లీ ఇంటికి రావడం, క్లైమాక్స్‌లో మళ్లీ లేచి పోవడం లాంటి సన్నివేశాలు హీరోయిన్ పాత్ర ఔచిత్యాన్ని దెబ్బతీశాయి. దీని వల్ల అప్పటివరకు ఎంతో హుందాగా కనిపించిన మిగతా పాత్రల వెయిట్ కూడా తగ్గిపోయింది.

బుజ్జిగాడు అలియాస్ శీనుగా రాజ్‌తరుణ్ ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా శుభ్రంగా నటించేశాడు. తనలోని కామెడీ టైమింగ్‌ను మరోసారి రుచి చూపించాడు. హీరోయిన్ మాళవిక సహజ నటన సినిమాకు ప్లస్ అయింది. బాగా పేలుతుందనుకున్న వాణి విశ్వనాథ్ పాత్ర తేలిపోగా... సీనియర్ నరేష్, పోసానితో సహా మిగతా నటులంతా తమ పరిధి మేరకు నటించారు. హెబ్బా పటేల్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. టెక్నికల్‌గా సినిమా ఉన్నంతలో బాగుంది. సినిమాటోగ్రఫీ, ప్రొడక్షన్ వాల్యూస్ రిచ్‌గా ఉన్నాయి. అనూప్ ఓ 2 పాటలతో ఆకట్టుకొని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో నిరాశపరిచాడు. ఎడిటర్‌కు 50శాతం మార్కులే పడతాయి.

ఓవరాల్‌గా చూసుకుంటే ఒరేయ్ బుజ్జిగా సినిమా రొటీను కామెడీ మూవీ. 90లనాటి సీన్లతో సాగే కామెడీ డ్రామా. కొన్ని కామెడి సీన్లు బాగున్నాయి. ఐతే వాటిని ఎంజాయి చెయ్యాలంటే చేతిలో రిమోట్ పట్టుకొని రెడీగా ఉండాలంతే.

*బాటమ్ లైన్ - మిడిల్ డ్రాప్ బుజ్జి*

*రేటింగ్ - 2.25/5*




OUR SERVICES

- USA VISITOR INSURANCE
- INTERNATIONAL TRAVEL INSURANCE
- SCHENGEN / EUROPE INSURANCE
- TRIP CANCELLATION INSURANCE
- INTERNATIONAL STUDENT INSURANCE
- NEW IMMIGRANT INSURANCE



MURALI TALLURI
FOUNDER
+1 (512) 917-8686
murali@visitorsplaza.com

VISITORS PLAZA
Visitors Medical Insurance Experts

www.visitorsplaza.com | info@visitorsplaza.com
1.800.610.2567

UNDAVALLI
CONSTRUCTIONS

# PAY 10% NOW

## 0% INTEREST TILL POSSESSION

**668 LUXURY APARTMENTS**

~~2 Bhk~~, 3 Bhk, 4 Bhk & 4 Bhk Duplex from
1200 SFT – 4160 SFT LUXURY FLATS

APRERA APPROVED



## JUST A FEW MINUTES DRIVE FROM VIJAYAWADA AND AP SECRETARIAT

Club House / Swimming Pool / Kids Pool / Multi-Purpose Function Hall / Mini Theatre
Amphitheatre / Cafeteria / Well Equipped Gymnasium / Aerobics / Meditation Hall / Jogging Track
Yoga Room / Health Spa / Children's Play Area / Outdoor Cricket Court / Basket Ball Court
Badminton Court / Shuttle Court / Elder Parks / Squash Court / Table Tennis / World Class Sports






Design By CREATIVE ETHICS.COM +91 98 32 93 29 53 (INDIA)

SRIVALLI
PRAVAS
*Your Heaven on Earth*

# LETS YOUR DREAMS COME TRUE

**on VJA - GNT National Highway at KAZA TOLL PLAZA**

Bank Loans Available

+1 314 256 9132 (USA) 88 99 11 8888 (INDIA) sales@ucpl.io www.ucpl.io